ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 | సంచిక : 02 | అక్టోబర్ 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 24
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ............. 19-07-09
అయి భీమవరం ... 01-09-09
చింతపర్రు ............ 06-09-09

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-07-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏసు ప్రభువు గొఱ్ఱెలకాపరి, కృష్ణుడు గోవుల కాపరి. ఆ గొఱ్ఱెలమూ మనమే, ఆ గోవులమూ మనమే. నేను గొఱ్ఱెలకాపరిని అని ఏసు చెప్పలేదు, నా గొఱ్ఱెలకు నేను కాపలాదారిని అని చెప్పాడు. నా గొఱ్ఱెలు అంటే ఆయనపట్ల విశ్వాసం కలిగిఉన్నవారిని, తరింపచేసే వరకూ వారిని విడిచిపెట్టడు. మీరు అందరూ శ్రద్ధగా వస్తున్నారు. మీరు అందరూ తరించాలి. భవిష్యత్తులో మీకు శరీరాలురావటం ఆగిపోవాలి. ఏ స్థితిని పొందిన తరువాత దానితోటి సమానమైన సుఖంగాని, దానికి మించిన సుఖంకాని లేదు అని తెలుస్తుందో ఆ స్థితిని పొందు అర్జునా అని పరమాత్మ చెప్పాడు. అంటే మీరు కూడా అటువంటి సుఖాన్ని పొందాలి. లేకపోతే ప్రయోజనం ఏమిటి? మనం అమృతస్థితిని పొందాలి, మనం మోక్షస్థితిని పొందాలి. మన శరీరానికి రోగం వస్తే శరీరం బాగుచేసుకుంటాము, మన ఇల్లు పాడైపోతే ఇంటిని బాగుచేసుకుంటాము, కాని మనందరం మనస్సుని బాగుచేసుకోము. మనస్సు దగ్గరకి వచ్చేటప్పటికి అందరికీ బద్దకమే, అశ్రద్ధయే. మనస్సుని బాగుచేసుకోవాలని కూడా మనకి తెలియటంలేదు. మనం చనిపోయిన తరువాత మన ఇల్లు మనకూడా రాదు. మన శరీరం మనకూడా రాదు, మన మనస్సు వస్తుంది. ఆ మనస్సునే జీవుడు అంటారు. మన శరీరం చనిపోయిన తరువాతకూడా వచ్చేజీవుడిని బాగుచేసుకోవటానికి కాని, వాడిని కండిషన్‌లో పెట్టుకోవటానికి కాని ఏమీ ప్రయత్నం చేయటం లేదు. మేము సాధన చేస్తున్నాము అని చెప్పేవారికి కూడా వారి మనస్సు

ఏమీ బాగుపడినట్టు కనబడదు. మీ మనస్సును మీరు బాగుచేసుకుంటూ ఉంటే దాని తాలుక శాంతి మీ మాటలో, చేతలో, మీ ప్రవర్తనలో తెలియాలి. మన మనస్సుని బాగుచేసుకోవటం చాలా కష్టం. ఎందుచేతనంటే మన పూర్వజన్మలనుండి వచ్చిన వాసనలు మనస్సుని అంటిపెట్టుకుని ఉంటాయి. మనం బాగుపడినా మన మనస్సే కారణం, మనం పాడైపోయినా మన మనస్సే కారణం. అందుచేత అన్నింటికంటే మనస్సుని బాగుచేసుకోవటం ముఖ్యం, మనోనిగ్రహం ముఖ్యం. కొండంత మనోనిగ్రహం ఉన్నవాడు కొండంత బాగుపడతాడు, కొండంత లాభం పొందుతాడు. గోరంత మనోనిగ్రహం ఉన్నవాడు గోరంత బాగుపడతాడు, గోరంత లాభం పొందుతాడు. మీరు మామూలు నిగ్రహంకాదు కొండంత మనోనిగ్రహం సంపాదించాలి. అప్పడు ఇహంలోని, పరంలోని కూడా మీకు కొండంత లాభం వస్తుంది.

రమణమహర్షిగారి శరీరాన్ని నేను చూడలేదు. నాకు రమణమహర్షిగారికి మానసిక అనుబంధం లేదు. నాకు ఆయన చుట్టాలు కాదు. రమణమహర్షి నాకు శరీరానికి సంబంధించినవారుకాదు, మస్సుకి సంబంధించినవారు కాదు. మా సంబంధం మనో దేహములకు అతీతమైనది. అది చైతన్యస్థాయిలో ఉన్నటువంటి అనుబంధం. అందుచేత ఎన్నిగాలివానలు వచ్చినా మాకు భగవాన్‌కి ఉన్న అనుబంధం పోలేదు. అది మానసిక అనుబంధం అయితే పోతుంది. అది చైతన్యానికి సంబంధించినది. ఆ మహాచైతన్యంలో చైతన్యం ఉంది కాని నేను ఉండదు. ఆ నేను లేనప్పడు స్నేహం శాశ్వతం. గురువు అనుగ్రహం మన దేహానికి సంబంధించినదికాదు, మన మనస్సుకి సంబంధించినది కాదు అది మనలను ఈ జననమరణ చక్రంలోనుండి, ఈ భ్రాంతిలోనుండి, ఈ మాయలోనుండి ఒడ్డుకి చేర్చే వరకూ విడిచిపెట్టదు. అది కళ్ళకు కనబడదు, చెవులకు వినబడదు. ఇట్టిదని మాటలతో చెప్పలేము. అటువంటి అనుబంధం మనకి గురువుతో కుదిరితే ఆయన అనుగ్రహం కలిగితే ఆయన స్వరూపాన్ని మనకి ఇచ్చేవరకూ మనల్ని విడిచిపెట్టడు ఆయన గురువు. సత్వగుణం, రజోగుణం, తమోగుణం ఈ మూడుగుణాలే మన చావుపుట్టుకలకు కారణం. గుణాలు విడిచిపెట్టి బయటకు రాకపోతే ఈ జననమరణ చక్రంలోంచి మనం బయటకు రాలేము. ఈ మూడుగుణాలు జయించినవాడిని బ్రహ్మజ్ఞాని అంటారు. సత్వగుణం ఉన్నపుడు మనం శాంతిగా, నిర్మలంగా ఉంటాము. రజోగుణం ఉన్నపుడు మన మనస్సు ఏదొక ఆకర్షణలోకి గెంటుకుంటూ వెళ్ళిపోతుంది. తమోగుణం ఉన్నప్పడు మొద్దులాగ ఉంటాము. మనకు ఒకోసారి సత్వగుణం వస్తూ ఉంటుంది, ఒకోసారి రజోగుణం వస్తూ ఉంటుంది, ఒకోసారి తమోగుణం వస్తూ ఉంటుంది. వచ్చినా అవి గుణాలే అవి నేను కాదు, వాటికి నాకు సంబంధం లేదు అని,

వాటికి వేరుగా ఉండి చూసిచూడనట్టు ఉంటే అవి వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి. వాటితో జతచేయకు. జ్ఞానికి కూడా పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి ఈ గుణాలు వస్తూ ఉంటాయి, వచ్చినా జ్ఞాని వాటితో జతకట్టడు.

మన శరీరానికి దురదవస్తే ఏదో ఆయింట్‌మెంట్ రాసుకుని తగ్గించుకోవచ్చు కాని మీకు కీర్తికాంక్ష వస్తే తగ్గించుకోలేరు. అసలు రాకుండా ఉండాలికాని కీర్తికాంక్ష వస్తే తగ్గించుకోవటం చాలా కష్టం. మనకు ఏదైనా బలహీనత ఉంటే అది తొందరగా పోదు. మన ప్రయత్నం ఉండాలి, కాలం కలిసిరావాలి, గురువు అనుగ్రహం, దైవానుగ్రహం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిసివస్తే గాని ఆ బలహీనతలోంచి మనం బయటకు రాలేము. కీర్తి కాంక్ష కూడా ఒక బలహీనతే. మీరు ఏదైనా పని చేస్తే అహంభావన లేకుండా, కీర్తికాంక్ష లేకుండా ఆ పని పనికోసమే చేయండి. గౌరవంకోసం మీరు పనిచేస్తే దేహగతమైననేను పెరిగిపోతుంది. అందుచేత గొప్పలకోసం ఏ పని చెయ్యకూడదు. మనకి గొప్పలకోసం పనిచెయ్యాలని అనిపిస్తే అప్పడు మనం రజోగుణంలో ఉన్నామని అర్థం. మనకు మోక్షం కావాలి అంటే మన శరీరం ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే మన జీవితాన్ని భగవంతునికి అంకితం చేసుకోవాలి. ఇది గారడీమాటల వల్ల వచ్చేదికాదు. ఎవరైతే బ్రాహ్మీస్థితిని పొందటానికి తన జీవితాన్ని అంకితం చేసుకుంటారో వారు మాత్రమే బ్రాహ్మీస్థితిని పొందగలరు. అలాగని మీరు చేసే ప్రయత్నాలకు ఉపకారము ఉండదనికాదు. మీరు ఇప్పడు ఎంతోకొంత ప్రయత్నం చేస్తున్నారు, ఈ జన్మలోకాకపోయినా రాబోయే జన్మలోనైనా దానికి ఎంతోకొంత ఫలితం ఉంటుంది. చేసే సాధనకాని, చేసే ప్రయత్నంకాని వ్యర్థంకాదు. ఇది రాబోయే జన్మలలో మీకు కలసివస్తుంది అని పరమాత్మ చెప్పాడు. మనం కాని దేహంతోటి, మనంకాని మనస్సుతోటి, మనంకాని లోకంతోటి మనం ఐక్యమైపోతున్నాము. మనం ఏదైతే అవునో దానితోటి ఐక్యమవ్వలేకపోతున్నాము. ఇప్పడు నీ శరీరంతోటి నీకు ఎంత తాదాత్మ్యం ఉందో, నీ మనస్సుతోటి ఎంత తాదాత్మ్యం ఉందో అలాగే నీ లోపల ఉన్నటువంటి పరమాత్మతోటి అంత తాదాత్మ్యం వస్తే ఈ జన్మలోనే నీకు మోక్షం వస్తుంది. లోకవాసన ఎక్కువ ఉన్నవారు రామకృష్ణుడు దగ్గరికి వస్తే వారిని పేరుపెట్టి చెప్పేవారు కాదు మాయ వచ్చేస్తోంది, మాయ వచ్చేస్తోంది జాగ్రత్తగా ఉండండి అనేవారు. అంటే లోకవాసన ఉన్నవారితోటి జాగ్రత్తగా లేకపోతే మనలని కూడా వారు లోకంలోకి ఈడ్చేస్తారు అనేవారు.

మీ శరీరయాత్రకి సరిపడ పనులు మీరు చేసుకోవాలి. మిగతా కాలమంతా నన్నే

తెలుసుకోవటానికి ఉపయోగించండి అని పరమాత్మ చెప్పాడు. లోకాన్ని చూసి మోహపడకండి. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఇందులో ఏ వాసనలో పడినా మనం బాహ్యముఖానికి వెళ్ళిపోతాము. కుంజుస్వామి భగవాన్‌కి 30 సం॥లు సేవ చేసారు. కుంజుస్వామికి భగవాన్ అంటే చాలా ఇష్టం. భగవాన్‌ని అందరూ గౌరవించాలని ఆయన ఉద్దేశ్యం. స్వామి నేను కొన్ని ఆశ్రమాలకు వెడుతున్నాను. నువ్వు ఎక్కడనుంచి వచ్చావు అని అడుగుతున్నారు. రమణాశ్రమం నుంచి వచ్చాను అన్నాను. వారు ఏవో ప్రశ్నలు అడుగుతున్నారు. నాకు చదువు తక్కువ వలన నేను సమాధానాలు చెప్పలేకపోతున్నాను అందుచేత నేను పండితుడి దగ్గరకు వెళ్ళి వేదాంతం అంతా నేర్చుకుని వచ్చి అప్పుడు వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తాను దానిని బట్టి మీకు గౌరవం పెరిగిపోతుంది అని కుంజుస్వామి అన్నారు. అదేమిటిరా మళ్ళీ ఈ మాయలో పడుతున్నావు కుంజూ! నేను చదువుకున్నానా? నన్ను ఎవరైనా ఏదైనా అడిగితే నేను ఎలా సమాధానం చెబుతున్నానో నువ్వుకూడా అలాగే చెప్పవచ్చు. ముందు నువ్వు తపస్సు చేసి, అరుణాచలాన్ని నిరంతరం స్మరించుకుంటూ నీ హృదయంలో ఒక సత్యం ఉంది కదా ముందు దానిని తెలుసుకో, దానిని తెలుసుకున్న తరువాత నిన్ను ఏదైనా అడిగితే దానికి సమాధానం నీ హృదయంలోంచే వస్తుంది. మళ్ళీ పాండిత్యం నేర్చుకుని ఆ మాయలో పడకు అన్నారు భగవాన్.

మనం ఎదుటివారి మానసికప్రవృత్తిని బట్టి నడుచుకోవటం మంచిది. అలా నడుచుకుంటే గలాటా ఉండదు. అయితే వారి మనస్తత్వం వలన మనం పాడైపోకుండా చూసుకోవాలి. మన స్వతంత్ర్యం మనం పోగొట్టుకోకూడదు. బాహ్యంగా వారికి అనుకూలంగా ప్రవర్తిస్తున్నప్పటికి లోపల మన జాగ్రత్తలో మనం ఉండాలి. భగవాన్ ఎక్కువ మౌనంగానే ఉండేవారు. మీరు ఏదైనా అడిగితే దానికి సమాధానం చెప్పటం వలన మీరు బాగుపడతారంటేనే సమాధానం చెప్పేవారు, మనం మాట్లాడినా వారు అర్థం చేసుకోలేక వికారం తెచ్చుకుంటారేమో అని ఆయన అనుకుంటే మౌనంగా ఉండేవారు. అది మంచిపద్ధతి. దానికి పాండిత్యంతో సంబంధం లేదు. నన్ను ఆరాధించండి, నన్ను స్మరించండి. ఒక చేత్తో నన్ను పట్టుకోండి, ఒక చేత్తోటి ఇంటిదగ్గర పనులు చేసుకోండి. మీకు ఒక చేత్తోటి నన్ను పట్టుకోవటం అలవాటు అయితే మీ డ్యూటీ అయిత తరువాత నన్ను రెండు చేతులుతోటి పట్టుకుంటారు అని పరమాత్మగీతలో చెప్పాడు. మనకు ఏదైనా కష్టం వస్తూ ఉంటుంది లేకపోతే సుఖం వస్తూ ఉంటుంది ఇవన్నీ మనోకల్పితములే. జ్ఞానికి ఇవన్నీ వస్తూఉంటాయి, పోతూఉంటాయి. జ్ఞాని ఏమనుకుంటాడు అంటే ఇవి గుణాలే ఇవి మనం కాదు ఇవిపూర్వం ఉన్నటువంటి అలవాట్లను బట్టి వస్తున్నాయి అని వాటిని అంటుకోడు, వాడు జ్ఞాని. మీరు అగ్గిపుల్లగీసి సిమెంటు దగ్గర

వెయ్యండి అది అంటుకోదు, పుల్ల ఆరిపోతుంది. అగ్గిపుల్లగీసి గడ్డిమేటు దగ్గర వెయ్యండి గడ్డిమేటు అంతా అంటుకుపోతుంది. జ్ఞాని లోపల గడ్డిమేటు లేదుకాబట్టి అంటుకోదు. మనలోపల గడ్డిమేటు ఉంది కాబట్టి అంటుకుంటాము. జ్ఞానికి కూడా ఒకోసారి గుణాలు వస్తూ ఉంటాయి. ఇవి గుణాలు ఇవి మనంకాదు అని ఆయనకు తెలుస్తూఉంటుంది. అందుచేత సిమ్మెంటుమీద అగ్గిపుల్ల ఆరినట్టే వచ్చి వెళ్ళిపోతాయి.

మీకు ఏదైనా కష్టము వస్తే ఇది నిత్యముకాదు అనుకోండి. మీకు సంతోషం వస్తే ఇది నిత్యము కాదు అనుకోండి. మనస్సు వచ్చాక లోకం వస్తోంది, దేవుడు అనే భావన వస్తోంది. మనస్సు వచ్చాక లాభనష్టాలు, కష్టసుఖాలు వస్తున్నాయి. మనస్సు వచ్చాక రాబోయే జన్మల గొడవ, పూర్వజన్మల గొడవ వస్తున్నాయి. మనస్సు వచ్చిన తరువాత ఏమి వస్తున్నాయో అవి అన్నీ నూటికి నూరుపాళ్ళు కల్పితములు. దేనిని పోగొట్టుకుంటే వికారాలు అన్నీ పోతేయో దానిని పోగొట్టుకో అన్నాడు పరమాత్మ. నీకు రాబోయే జన్మలు మనస్సులో ఉన్నాయి. ఆ మనస్సు కాలిపోతే నీ మనస్సులో ఉన్న గొడవలు అన్నీ కాలిపోతాయి. అంటే రాబోయే జన్మలకు వచ్చే బీజాలు అన్నీ కాలిపోతాయి. మేము అక్కడికి వెళ్ళిసాధన చేసుకుంటాము, ఇక్కడకు వెళ్ళి సాధన చేసుకుంటాము అంటే ఇప్పుడు మీకు తినటానికి తిండి ఉంది, కట్టుకోవటానికి బట్టలు ఉన్నాయి, చదువుకోవటానికి పుస్తకాలు ఉన్నాయి, స్నేహాలు చేయటానికి సత్పురుషులు ఉన్నారు. భగవంతుడు అన్ని అవకాశాలు ఇచ్చినప్పుడు సాధన చేయలేకపోతే భవిష్యత్తులో సాధన ఏమి చేస్తారు. ఇంక రాబోయే జన్మలో ఎన్ని కష్టాలు ఉన్నాయో, రాబోయే జన్మలో మీరు ఎంత కర్మ అనుభవించాలో అది మీకు తెలియదు, ఇప్పుడు మీకు అన్ని పరిస్థితులు బాగున్నప్పుడు మీరు సాధన చేయలేకపోతే ఇంక భవిష్యత్తులో ఏదైనా చెడ్డ జన్మలు వస్తే అప్పుడు సాధన ఏమి చేయగలరు. లోకంలో ఉన్నవి అన్నీ ఆకర్షణలు అందులో ఏమీ లేదు, అవి నిజంకాదు. మన వాసన బట్టి లోకంలో గొడవలు అన్నీ నిజంకింద అనిపిస్తాయి. బయట ఏమీలేదు. మనం సాధనచేసి పోగొట్టుకోవలసింది అంతా లోపలే ఉంది.

బ్రాహ్మీస్థితి పొందినవాడిమాట ఒక్కమాట చాలు మనకి జ్ఞానం రావటానికి. మీ అజ్ఞానానికి ఏ గురువో, ఏ అవతార పురుషుడో కొంచెము నిప్ప పెట్టాడు అనుకోండి అది కాలటం ఆలస్యం అవ్వవచ్చు. కాని మన అజ్ఞానం కాలిపోతుంది. ఓరామా! దశరథరామా తనువు తాను కాదని తెలిసినవాడికి తపమేల, జపమేల అన్నాడు త్యాగరాజు. నీకు దేహము నేను అనే తలంపు లేకపోతే నీకు జపముతోటి పనేముంది, తపముతోటి పనేముంది. ఏది ఎప్పుడు ఎలా జరగాలో అది నీ శరీరం వచ్చినప్పడే ఈశ్వరుడు చేత నియమింపబడి

ఉంటుంది. ఇది అర్థం అయినవాడికి ఇంక చాపల్యం ఏముంది. మనందరం ఎందుకు మంచివారము కాదంటే మన బుద్ధిమంచిది కాదు. ఎందుచేత అంటే న్యూస్‌పేపరులో వచ్చినమాటలు నమ్ముతాము, లోకానికి సంబంధించిన మాటలు నమ్ముతాము కాని భగవంతుడు భగవద్గీతలో చెప్పినమాటలు నమ్మము. ఎందుకంటే మనకి పుణ్యబలం లేదు, ఎప్పుడు సత్కర్మ చెయ్యలేదు, మనం సత్పురుషులతోటి సహవాసం చెయ్యలేదు, మనం మంచి చెయ్యక్కర్లేదు ఎవరైనా మంచి చేస్తే చూచి సంతోషించలేము, ఆనందించే స్వభావం మనకి లేదు. ఇంక మనకి శాంతి ఏమిటి? మనకి జ్ఞానం ఏమిటి? మనకి మోక్షం ఏమిటి? శరీరం, మాట, మనస్సు ఇవి మూడే మనకి పుణ్యం సంపాదించి పెట్టినా, మనకి పాపం సంపాదించి పెట్టినా మనం ఒకమాట మాట్లాడేటపుడు పదిసార్లు ఆలోచించి మాట్లాడాలి. మనం పని చేసేటప్పుడు ఆ పని మనం అహంకారం కోసం చేస్తున్నామా? గొప్పలకోసం ఆ పని చేస్తున్నామా లేక నిర్మల బుద్ధితోటి నిశ్చలబుద్ధితోటి చేస్తున్నామా అని ఆలోచించుకుని ఆ పని పని కోసమే చేస్తే ఈశ్వరుని దయ మనకు కలుగుతుంది.

మనం ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చున్నప్పుడు మన మనస్సులోకి తలంపులు వస్తాయి, అవి మంచితలంపులా, చెడ్డతలంపులా అని చూసుకుని చెడ్డతలంపులు అయితే ఓ పరమేశ్వరుడా నాకు చెడ్డతలంపులు వస్తున్నాయి, ఈ చెడ్డతలంపులను తగ్గించి నిన్ను తెలుసుకోవటానికి ఎటువంటి తలంపులు అవసరమో అటువంటి తలంపులు ప్రసాదించు తండ్రీ అని ప్రార్థించాలి. మీరు ఆలోచించినా, మాట్లాడినా, పని చేసినా, సాధన చేసినా వీటి ద్వారా ఈశ్వరుని దయ సంపాదించాలి, అదే నిజమైన సంపాదన. ఈశ్వరుడి దయ కనుక మనకి ఉంటే అసాధ్యము అంటూ ఏమీ లేదు అన్నీ సాధ్యమే, మోక్షం కూడా సాధ్యమే. గాంధీగారు స్వాతంత్ర్యం తీసుకురావటానికి ఆయన జీవితం ఎలా అంకితం చేసారో అలా ఎవరైతే తన హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి తన జీవితాన్ని అంకితం చేసారో, జీవితం పొడుగునా ఈశ్వరుడు పట్ల అర్పణభావంతో పని చేసారో వారికి మాత్రమే హృదయంలో ఉన్న సత్యం తెలియబడుతుంది. మీరు కాలక్షేపానికి చేస్తే చేసుకోండి అది ఊరికేపోదు పుణ్యం వస్తుంది అది రాబోయే జన్మలో ఉపయోగపడుతుంది.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అది మనకి అనుభవంలోనికి వచ్చేవరకూ మనం శవాలను మోస్తూనే ఉండాలి. తెలివితక్కువవాడికి తెలివైనవాడికి తేడా ఏమిటి అంటే తెలివైనవాడు అవకాశం వచ్చినప్పుడు పట్టుకుని ఉపయోగించుకుంటాడు, తెలివితక్కువవాడు వచ్చిన

అవకాశాన్ని వదిలిపెట్టేస్తాడు. అవకాశం రాకపోతే తెలివైనవాడు ఏమి చేయలేడు, తెలివితక్కువవాడు ఏమీ చేయలేడు. తెలివి తక్కువగా జీవించకు, సూక్ష్మబుద్ధితోటి జీవించు, వివేకవంతుడై జీవించు అని పరమాత్మ చెప్పాడు. మీ మనస్సును మీరు బాగుచేసుకుంటే మీ మాట బాగుంటుంది, మీ చేత బాగుంటుంది, మీ ఆరోగ్యం బాగుంటుంది. మీ బాగుపడిన మనస్సే మీకు మోక్షాన్ని కూడా తెచ్చిపెడుతుంది. మన మనస్సును బాగు చేసుకోవటంకంటే మించిన పని ఈ ప్రపంచంలో లేదని మనకి తెలియటం లేదు. అందుచేత మనం మంచి వాళ్ళము కాదని చెప్తున్నారు. ఉన్నది ఒక్కటే అదే బ్రహ్మము, ఆ బ్రహ్మము గురించి మననం చేస్తూ ఉండు, నువ్వు అబద్ధాన్ని మననం చేయటంకాదు నువ్వు మాట్లాడితే బ్రహ్మం గురించి మాట్లాడు, బ్రహ్మం గురించి ఆలోచించు, బ్రహ్మం గురించి స్మరణ చేస్తూ ఉండు, ఎవరైనా బ్రహ్మం గురించి చెప్తే నువ్వు విను, ఇలా బ్రహ్మమును తెలుసుకోవటానికి ఎవడైతే తన జీవితాన్ని అర్పించుకున్నాడో వాడికి మాత్రమే బ్రహ్మము తెలియబడుతుంది.

ఈ లోకం అసత్యం, ఈ పుట్టుకలు, చావులు అసత్యం, ఈ లాభనష్టాలు అసత్యం, ఈ సుఖదుఃఖాలు అసత్యం ఈ అసత్యాలు గురించి ఎంతకాలము వింటావు వీటి గురించి విని, విని నువ్వు టైరు అవ్వలేదా అంటున్నాడు పరమాత్మ. మీ మనస్సు ఉండవలసిన చోట ఉంటే ఈ లోకం గొడవలు అసలు మిమ్మల్ని ముట్టుకోవు. బ్రాహ్మీస్థితి పొందటానికి మంచితనం సహకరిస్తుంది కాబట్టి మిమ్మల్ని మంచితనం పెంచుకోమన్నారు. ఎదుటవారు చెప్పకోవటానికి మనం మంచివాళ్ళుగా ఉండకూడదు. ఆ మంచి దేవుడు మెచ్చుకోడు. మీకు సహజమైన మంచితనం, నేచురల్ పవిత్రత నీ మనస్సుకి వచ్చినప్పడే దేవుడు నిన్ను ప్రేమించి, ఆయన దయ నీ మీద చూపించి తన స్వరూపాన్ని నీకు ఇస్తాడు వాడు దేవుడు. రాముడు తమ్ముళు ళ్ళు రాముడిని ఎపుడూ అన్నగారిలా చూడలేదు, రాముడుని భగవంతుడిగా చూసారు. అలాగే మనం భగవాన్‌ని శరీరంగా చూడకూడదు. భగవంతుడికింద చూస్తేనే ఆయన చెప్పినమాట మన హృదయంలోనికి చొచ్చుకొనివెడుతుంది. భగవంతుడిగా చూడకపోతే ఆ మాట మన హృదయంలో ప్రవేశించదు. ఎందుచేతనంటే భగవాన్ దైవానికి భిన్నంగా లేరు. భగవాన్ దేని గురించి అయితే చెప్తున్నారో అది అయి చెప్తున్నారు, ఆ వస్తువు భగవాన్ వేరుకాదు.

మానవుడి దుఃఖానికి ఒకటే కారణం. అది కర్తృత్వబుద్ధి, అదే దేహము నేను అనే తలంపు. నీకు కర్తృత్వంపోతే దుఃఖం లేదు, అది ఉన్నంతసేపు నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. దేహబుద్ధిలో దుఃఖం ఉంది, ఆత్మబుద్ధిలో దుఃఖం లేదు. అందుచేత మనం దేహబుద్ధిలో నుండి ఆత్మబుద్ధిలోకి

ప్రయాణం చేయాలి. ఈ ప్రయాణం బయట జరిగేది కాదు లోపల జరగాలి. అశాంతిలోనుండి శాంతిలోనికి వెళ్ళాలంటే, మృత్యువులో నుండి అమృతత్త్వంలోనికి వెళ్ళాలంటే ఈ దేహబుద్ధిని విడిచిపెట్టి ఎవరైతే ఆత్మబుద్ధిని అందుకున్నారో వారు మాత్రమే మృత్యువులో నుండి అమృతత్త్వమును పొందుతారు. ఎవరైతే అమృతస్థితిని పొందారో వారు ఇంక శవాలను మోయనక్కరలేదు. వ్యభిచారభక్తి తగ్గించుకోండి అంటాడు పరమాత్మ. వ్యభిచారభక్తి అంటే మనస్సు స్థిరంగా ఉండదు, రోజుకి ఒకలాగ ఉంటారు. మీకు వ్యభిచార భక్తి వద్దు. అవ్యభిచారభక్తి నాపట్ల కట్టివేటు చేసుకోండి. భక్తి రోజుకి ఒక రకంగా ఉండ కూడదు, భక్తి నిలకడగా ఉండాలి, నా పట్ల విశ్వాసం మీకు స్థిరంగా ఉండాలి, నా పట్ల ప్రేమ విడిచిపెట్టవద్దు. ఎటుగాలి వేస్తే అటు చెదిరిపోయేది వ్యభిచారభక్తి. నువ్వు ఇతరులకు సేవ చేస్తున్నావు అనుకో ఇతరులకు చెయ్యటంలేదు వారి రూపంలో ఉన్న నాకే చేస్తున్నావు అనుకో అలాగ అనుకుంటే ఆ సేవ నాకు అందుతుంది అప్పుడు నా అనుగ్రహానికి పాత్రుడవుతావు అన్నాడు పరమాత్మ.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-09-2009, అయి భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు రమణస్వామి మదురైనుండి అరుణాచలం విచ్చేసిన రోజు. ఆయన ఒకరోజు బడికి వెడుతూ మీరు ఎక్కడ నుండి వస్తున్నారు అని ఎదురుగా వచ్చిన ఒక బంధువును అడిగారు. నేను అరుణాచలం నుండి వస్తున్నాను అని ఆయన చెప్పారు. అరుణాచలం అనేటప్పటికి ఆయనకు భగవంతుడు స్ఫురించాడు కాని, అది ఒక క్షేత్రం అని ఆయనకు స్ఫురించలేదు. అరుణాచలం అంటే భగవంతుడు కదా, భగవంతుడు దగ్గర నుండి మనిషి రావటం ఏమిటి అనుకొన్నాడు. అరుణాచలం అనేది ఒక పుణ్యక్షేత్రం అని నీకు తెలియదా? దానినే తిరువణ్ణామలై అంటారు, అక్కడ నుండే వస్తున్నాను అని ఆ బంధువు చెప్పాడు. 1896వ సం॥లో ఆయనకు మరణానుభవం కలిగింది. అంతకుముందు ఆయనకు పెద్దగా భక్తి లేదు, ఎప్పుడైనా మీనాక్షి గుడికి వెళ్ళేవారు, ఆయన బ్రహ్మం గురించి చదువలేదు, శ్రవణం చేయలేదు, మననం చేయలేదు. మరి మరణానుభవం ఎలా కలిగింది అంటే అది దేవరహస్యం. మనం దేహాన్ని ఆత్మ అనుకొంటున్నాము, మనస్సును ఆత్మ అనుకొంటున్నాము, మనం అనుకొనేది ఏదీ నిజం కాదు. మనం ఎన్ని గ్రంథాలు చదివినా దేహాన్ని ఆత్మ అనుకొన్నంత కాలం, మనస్సును ఆత్మ అనుకొన్నంతకాలం మీరు ఎన్ని జన్మలు ఎత్తినా, వెయ్యి కోట్లు సంపాదించినా మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు. మేము సంతోషంగా ఉన్నాము అని మీరు

ఏదో ఊహించుకొంటున్నారు కాని ఇక్కడ అసలు సంతోషం అంటూ ఏమీ లేదు. ఏదో ఒక దుఃఖానికి ఇంకో దుఃఖానికి మధ్యన కొంచెం కామ్‌గా ఉంటారు, అదే సంతోషం అనుకొంటున్నారు. ప్రస్తుతం మీకు దుఃఖం రాకపోయినా దుఃఖం వాయిదా పడుతోంది.

మీ హృదయంలో ఒక సద్వస్తువు ఉంది, దుఃఖం యొక్క స్పర్శ ఎలా ఉంటుందో దానికి తెలియదు. రమణస్వామి మనలాగే ఈ దేహమే ఆత్మ, ఈ మనస్సే ఆత్మ అనుకొంటున్నారు. మరణానుభవంలో ఏమైంది అంటే ఆత్మకాని దేహంతోటి ఆత్మకాని మనస్సుతోటి పూర్తిగా విడిపోయారు. శరీరానికి మరణం వచ్చింది, ఈ శరీరాన్ని తీసుకొని వెళ్ళి స్మశానంలో కాల్చేస్తారు. శరీరం కాలిపోయినప్పుడు నేనుకూడా కాలిపోవాలికదా, కాని నేను కాలిపోకుండా సజీవంగా ఉన్నాను అనే అనుభవం ఆయనకు కలిగింది. మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే మన జీవిత గమ్యం అని కూడా ఆయనకు తెలియకుండా, దాని గురించి చదవకుండా, దాని గురించి వినకుండా, దాని గురించి ఆలోచించకుండా మరణానుభవం ద్వారా హృదయంలో ఉన్న సద్వస్తువు ఆయనకు స్ఫురించింది, అంటే అజ్ఞానంలో నుండి బయటపడి తాను ఏదిగా ఉన్నాడో ఆ వస్తువు తాలుక అనుభవం డైరెక్టుగా ఆయనకు కలిగింది. మరణానుభవం ద్వారా ఆయన మరణాన్ని జయించి బ్రాహ్మీస్థితిని పొందారు. ఆ స్థితిలో మనో దేహములతో విడిపోయారు, దేహానికి సంబంధించిన బంధువులు, స్నేహితులు, విరోధులు ఉన్నా ఆధ్యాస ఆయనకు పోయింది. ఇష్టాలు, అయిష్టాలు పోయినాయి. మనస్సు బయటవిషయాల మీదకు పోవటం లేదు, ఏదో యాంత్రికంగా జీవిస్తున్నాడు, చదువుల మీద మనస్సు ఉండటంలేదు.

మనం చాలా జాగ్రత్తగా మాట్లాడాలి అనుకొంటాము కాని మీ నోటినుండి పొరపాటు మాటలు రావాలి అని మీ ప్రారబ్దంలో ఉంటే సడన్‌గా వచ్చేస్తాయి. ఏ క్షణంలో ఏది జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది. ఈయనకు అరుణాచలం వెళ్ళే క్షణం వచ్చేసింది. అప్పడు అన్నగారు ఏమన్నారు అంటే నీబోటివారికి ఇంటికాడ పనిఏముంది, నువ్వు యోగిలాగ కనిపిస్తున్నావు, ఎక్కడికైనా పోరాదా అన్నాడు. అప్పడు కూడా ఆయనకు కోపం రాలేదు అన్నగారు చెప్పింది సత్యమే అనుకొన్నాడు. ఎక్కడికి వెళ్ళాలి అంటే అరుణాచలం, అరుణాచలం అని ఆయన హృదయంలో నుండి స్ఫురణ కలిగింది. అరుణాచలం ప్రయాణం అయ్యాడు. మరి పైసలు కావాలి కదా. ఈశ్వరుడి యొక్క లీల ఎలా ఉంటుందో చూడండి. ఎక్కడికి వెడుతున్నావు అని అన్నగారు అంటే స్పెషల్‌క్లాసు ఉంది వెళుతున్నాను అని చెప్పాడు. అయితే

ఫలానా గూటిలో మూడు రూపాయలు ఉన్నాయి తీసుకొని వెళ్ళి నా కాలేజీ ఫీజు కట్టు అని అన్నగారు చెప్పాడు అంటే ఈశ్వరుడు డబ్బు కూడా సమకూరుస్తున్నాడు. అక్కడ నుండి బయలుదేరి సెప్టెంబరు 1వ తేదీకి అరుణాచలం వచ్చాడు. గుడికి వెళ్ళి భక్తి జ్ఞాన వైరాగ్యములు ప్రసాదించమని భగవంతుడిని అడగలేదు. అప్పా నువ్వు రమ్మంటే వచ్చాను అన్నాడు. అంటే ఈ శరీరాన్ని నువ్వు వాడుకోవచ్చు అని చెప్పటం, అదీ శరణాగతి. అంటే టీచింగ్ కోసం ఈశ్వరుడే ఆయనను అరుణాచలం తీసుకొని వచ్చాడు. తరువాత చెరువు దగ్గరకు వచ్చి లాగు, చొక్కా తీసేసాడు. చొక్కాను ముక్క చేసి గోచి పెట్టుకొన్నాడు. జేబులో ఉన్న డబ్బులు కూడా పడేసాడు. ఆయన అంతట ఆయనే సన్యాసం తీసుకొన్నాడు. అక్కడ నేను అనేవాడు లేడు. ఆయన దృష్టిలో బ్రహ్మం తప్పించి నేను, నాది అనే తలంపులు నిజంకాదు, బ్రహ్మం తప్పించి మిగిలినది అంతా మనోకల్పితం.

రమణస్వామి పవళకుండ్రులో ఉండగా తల్లి వచ్చి ఇంటికి రమ్మని అడిగింది. తల్లితో ఏమని చెప్పాడు అంటే ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధముననుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఇది నిశ్చయం అని చెప్పాడు. ఇది మీకు అర్థమైతే ఇంక మీకు దుఃఖంరాదు. ప్రారబ్ధం ప్రకారం ఈ దేహం అరుణాచలంలో ఉండవలసి ఉంది, వచ్చింది, ఇది ఈశ్వర నిర్ణయం. ఈశ్వరసంకల్పం బలీయమైనది. మీ జీవితంలో కూడా ఏది ఎప్పుడు ఎలా జరగాలో అలా జరిగిపోతూ ఉంటుంది. ఇది మీరు జ్ఞాపకం ఉంచుకోండి. తరువాత విరూపాక్షగుహకు వచ్చారు. అప్పుడు ఆయనను కొంతమంది బ్రాహ్మణస్వామి అని, కొంతమంది చిన్నస్వామి అని పిలిచేవారు. విరూపాక్ష గుహలో ఉండగా గణపతిశాస్త్రిగారు భగవాన్ దగ్గరకు వచ్చారు. భగవాన్‌కు రమణమహర్షి అని నామకరణం చేసింది గణపతిశాస్త్రిగారు. భక్తులు మటుకు రమణమహర్షి అని పిలవకండి, భగవాన్ అని పిలుచుకోండి అని శాస్త్రిగారు చెప్పారు. తపస్సు అంటే ఏమిటి అని శాస్త్రిగారు భగవాన్‌ను అడిగారు. మనం నేను నేను అంటున్నాము, అది ఒక తలంపు. ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తుందో పరిశీలనగా చూడు, నేను అనే తలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది. నేను అనే తలంపు దాని పుట్టుస్థానంలో లయమైనప్పుడు అక్కడ ఉన్న సత్యం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది అని చెప్పారు. అదే తపస్సు. తరువాత కొంతకాలం స్కందాశ్రమంలో ఉన్నారు, తరువాత రమణాశ్రమం స్థాపించారు.

వారిని లెక్కచేయం, వీరిని లెక్కచేయం అని కొంతమంది అంటూ ఉంటారు. అది

కాదు. వారిని లెక్కచేయం, వీరిని లెక్కచేయం అని ఎవరు చెపుతున్నారు, నీ మనస్సు చెపుతోంది నీకు అడ్డు వచ్చేది అదే కదా. ముందు నీ మనస్సును లెక్కచేయటం మానెయ్యి, అప్పుడు అది గూటిలో పడిపోతుంది. నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక ఎరుక అప్పుడు నీకు వచ్చేస్తుంది. అది ప్రత్యక్షానుభవం. నిద్రలో ఉండగా మనకు జాగ్రదవస్థ ఏమీ తెలియదు అలాగని జాగ్రదవస్థ లేదా అంటే ఉంది. అలాగే జాగ్రదవస్థలో ఉండగా బ్రహ్మం గురించి మనకు తెలియటంలేదు అందుచేత బ్రహ్మం లేదు అనుకోవద్దు. బ్రహ్మం గురించి మనకు తెలియటం లేదు, అది మనం తెలుసుకోవాలి అని అనుకోవటం లేదు, బ్రహ్మం లేదు అనుకొంటున్నాము, ఇక్కడే మనం పొరపాటు చేస్తున్నాము. బ్రహ్మం గురించి నాకు తెలియటం లేదు అనుకోవటం వేరు, బ్రహ్మం లేదు అనుకోవటం వేరు. ఏదో ఉంది అది నాకు తెలియటం లేదు అనుకొనేవాడు, దాని గురించి ప్రయత్నం చేస్తాడు, బాగుపడతాడు. అసలు ఏమీ లేదు అనుకొనేవాడు బాగుపడటం కష్టం.

ఎవరైనా సహృదయంతో ఒక విషయం చెపుతూ ఉంటే ఆ సహృదయం మనకు లేకపోతే ఉన్నది ఉన్నట్లుగా దానిని మనం అర్థం చేసుకోలేము సరికదా చెడ్డగా అర్థం చేసుకొంటాము. ఉదాహరణకు బుద్ధుడు గయలో తపస్సు చేసేటప్పుడు ఆయన శరీరం బాగా శుష్కించిపోయి పడిపోవటానికి సిద్ధమవుతుంది. ఆయనతో కొంతమంది అక్కడ తపస్సు చేస్తున్నారు. అక్కడకు సుజాత అనే అమ్మాయి పాయసం తెచ్చి బుద్ధుడికి ఇస్తే ఆయన పాయసం తీసుకొన్నాడు. పాయసం ఎందుకు తీసుకొన్నాడు అంటే అక్కడ శరీరం నిలబడాలి, అది తీసుకోకపోతే శరీరం పడిపోతుంది. ఆయనతో తపస్సు చేసేవారు వీడు ఆహారం తీసుకొన్నాడు, వీడు పనికిరాడు అని అక్కడ నుండి సారనాథ్ వెళ్ళిపోయారు. బుద్ధుడు గయలో సిద్ధిపొందాడు, సారనాథ్‌లో మొదట టీచింగ్ చెప్పాడు. మనలను అపార్థం చేసుకొని ఎవరైనా బయటకు పోతే, పోతేపోయారు దరిద్రం వదిలింది అనుకొంటాము. బుద్ధుడు నిర్వాణస్థితి పొందాక బుద్ధగయలో అక్కడ ఉన్న ఒక చెట్టువంక అలా చూస్తూ కొంతకాలం ఉండిపోయాడు. అయ్యో మనకోసం చాలా రోజులు ఎదురుచూసారు, అపార్థం చేసుకొని వెళ్ళిపోయారు అని దివ్యదృష్టితో చూసి వారు సారనాథ్‌లో ఉంటే అక్కడకు వెళ్ళాడు. తన అనుభవాన్ని వారికి చెపుదామని వెళితే, వీడు పాడైపోయాడు అని మనం వదిలేసి వస్తే మరల ఇక్కడకు సిద్ధమవుతున్నాడు అని వారు అనుకొంటున్నారు. అటువంటి మాటలు వింటే మనకు కోపాలు వస్తాయి, ఇంక జీవితం పొడవునా వారి వంక చూడము, మాట్లాడము. కాని బుద్ధుడు ఆ మాటలు విన్న తరువాత కూడా నిర్వికారంగా ఉన్నాడు ఎందుచేతనంటే రియాక్షన్ పొందే మనస్సు అక్కడ

లేదు. వాడు భ్రష్టుడైపోయాడు, మనలను కూడా పాడు చేయటానికి వస్తున్నాడు అని వాళ్ళు అన్నా ఆయన ప్రశాంతంగా ఉన్నాడు, ఆయన చెప్పవలసింది చెప్పి, వారికి కూడా మహోన్నతస్థితిని కలుగజేసాడు, వాడు బుద్ధుడు.

నీ శరీరం భగవంతుడి చేతిలో పనిముట్టుగా ఉంది. శరీరం పుట్టినప్పుడే అది ఎక్కడ ఉండాలి, ఏ పని చెయ్యాలి, ఎప్పుడు ఆ శరీరం చనిపోవాలి ఇదంతా నిర్ణయింపబడి ఉంటుంది. నీ శరీరం ఏ పని చేయటానికి ఈ భూమి మీదకు వచ్చిందో ఆ పనిని నేను చెయ్యను, నేను చెయ్యను అన్నా నీచేత భగవంతుడు చేయించి తీరతాడు. నువ్వు స్వతంత్రుడవు కాదు. నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా నీ శరీరం ద్వారా ఆ పని జరిగిపోతూ ఉంటుంది. ఇంక సాధన ఎందుకు అంటే దానితో తాదాత్మ్యం పొందకుండా ఉండటానికే సాధన అవసరం. నా తెలివితేటల వలనే అది సాధించాను, పెద్దవాడిని అయిపోయాను అని ఇలా అనుకోవద్దు. మీరు బాగుపడటం, బాగుపడకపోవటం అనేది మీ దేహప్రారబ్ధాన్నిబట్టి ఉంటుంది కాని మీ తెలివితేటలను బట్టికాదు, మీరు ఎవరితో అయినా మాట్లాడుతున్నారు అనుకోండి, ఎవరివంక అయినా చూస్తున్నారు అనుకోండి, ఎవరితో అయినా వ్యవహారం చేస్తున్నారు అనుకోండి, వారి హృదయంలో అంతర్యామిగా నారాయణుడు ఉన్నాడు అని మరిచిపోవద్దు. మీరు ఎవరిమీద అయినా అయిష్టం పెట్టుకొన్నారు అనుకోండి నారాయణుడిమీద అయిష్టం పెట్టుకొన్నట్లే. మనకు ఎక్కడైనా ఎక్కువ ఇష్టం ఉంది అనుకోండి ఇంకోచోట అయిష్టం కూడా వచ్చేస్తుంది.

మీకు శరీరం వచ్చింది అంటే ఆత్మజ్ఞాన సముపార్జనకు గొప్ప అవకాశం వచ్చింది, ఈ అవకాశాన్ని మీరు పాడుచేసుకోవద్దు. మీరు కాలక్షేపం కబుర్లు వేసుకొని కూర్చుంటే మీకు కొత్తవాసనలు వచ్చేస్తాయి, అహంకారం పెరిగిపోతుంది. అందుచేత మీ పని ఏదో మీరు చూసుకొంటూ మిగతాటైమునంతా ఆత్మజ్ఞాన సముపార్జనకు ఉపయోగించాలి. జంతువులు భోగాలు అనుభవించటంతో సంతృప్తి పడిపోతాయి. మనం కూడా భోగాలకే మన జీవితాలను సరిపెట్టుకొంటే మనందరం మానవరూపంలో ఉన్న జంతువులం అని వివేకానందుడు అన్నాడు. ప్రారబ్ధాన్నిబట్టి మీకు లాభాలు వస్తాయి, నష్టాలు వస్తాయి, ఒకోసారి గౌరవం వస్తుంది, ఒకోసారి అగౌరవం వస్తుంది. భగవంతుడు మీకు ఏదైనా కష్టాలు ఇస్తే కంగారుపడకండి. కష్టాలను మీరు సహించగలిగితే తరువాత ఇవ్వవలసిన బహుమతి ఏదో ఈశ్వరుడు ప్రసాదిస్తాడు. ఈలోపుగా కంగారుపడి చనిపోతే బహుమతిని మిస్ అయిపోతారు. శరీరాలు మారినంత మాత్రంచేత మనం మంచివారము అయిపోము, దైవీసంపద వచ్చేయదు. శరీరాలు మారుతూ

ఉంటాయిగాని మనలో ఉన్న మంచిగుణాలు, చెడ్డగుణాలు అలాగే ఉంటాయి. మనం ఈ శరీరంలో ఉండగానే బాగుపడటానికి ప్రయత్నం చేసుకోవాలి. మీ ఇంటికి చుట్టం వస్తే ఇంట్లో ఉన్న రూపాయి కాగితాలను పొయ్యిలో పెట్టి కాఫీ కాచి ఇవ్వటం ఎలా ఉంటుందో మానవశరీరాన్ని భోగాలకు ఉపయోగించటం కూడా అటువంటిదే. బాహ్యప్రక్రియలతో సంబంధం లేకుండా, బాహ్యమైన వ్యక్తులతో సంబంధం లేకుండా డైరెక్టుగా మిమ్మల్ని ఆనందసముద్రంలోనికి గెంటటానికి వచ్చిన అవతారమే భగవాన్. మీకు బాహ్యంగా ఎన్ని భోగాలు ఉన్నా, ఎన్ని సంపదలు ఉన్నా ఆనందం లేకపోతే ఏమీ లేనట్లే. ఆనందస్థితిని పొందేవరకు మీకు శరీరాలు రావటం ఆగదు. ఆనందస్థితిని మీచేత పొందింపచేయటానికే భగవాన్ వచ్చారు.

కృష్ణుడు ఆడవారితోటి ఆడుకోవటం ఏమిటి, ఆయనకు ఆడవాళ్లతోటి పని ఏముంది అంటారు. కృష్ణుడు అంటే ఎవరు పరమాత్మ, ఆయన శరీరరహితుడు, శరీరం ఉన్నా శరీరం లేనివాడితో సమానం. భగవంతుడు పుట్టడు, పుట్టినవాని వలె కనిపిస్తాడు. దేహం ఉంటే స్త్రీ అని, పురుషుడు అని అసలు దేహమే లేనప్పుడు ఇంక స్త్రీ ఏమిటి, పురుషుడు ఏమిటి. మనం ఆ కోణంలో చూడటంలేదు. మనం దేహానికి పరిమితమై ఉన్నాము కాబట్టి పరమాత్మను కూడా దేహానికి పరిమితం చేస్తున్నాము. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి అలాగే ఆయనకు కూడా దేహబుద్ధి ఉందని అనుకొంటున్నాము. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, అదే బ్రహ్మం. అదే మనకు ప్రపంచంగా కనిపిస్తోంది. అంటే బ్రహ్మంనందు ప్రపంచం కల్పించబడుతోంది. ఒకోసారి తాడు మనకు పాముగా కనిపిస్తుంది. ఆ తాడు తాడుగా నీకు తెలిస్తే అప్పుడు ఈ పాము తాడునందు కల్పించబడింది అని తెలుస్తుంది. అలాగే మీకు బ్రహ్మం తాలుక ఎరుక వచ్చాక ఈ ప్రపంచం బ్రహ్మంలో కల్పించబడిందే కాని ఇది నిజంగా లేదు అని తెలుస్తుంది. అయితే ఇలా కల్పించబడటానికి మాయ కారణం. మాయ జీవుడి స్వాధీనంలో ఉండదు, మాయ భగవంతుడి స్వాధీనంలో ఉంటుంది. అందుచేత నువ్వు ఈశ్వరుడి పాదాలను పట్టుకొంటే మాయ బయటకు పోతుంది. మాయ ఎప్పుడైతే బయటకు పోయిందో ఉన్నది ఉన్నట్లుగా నీకు గోచరిస్తుంది. అప్పటివరకు మాయ నిన్ను విడిచిపెట్టదు.

మీరు ఎప్పుడైనా భగవాన్‌ను భౌతికంగా చూసారా అని నన్ను కొంతమంది అడుగుతూ ఉంటారు. ఈ శరీరంతో చూడలేదు. ఇంతకు ముందు శరీరంతోటి విరూపాక్షగుహలో ఉండగా చూసాను. అంటే జన్మలు మారినా అనుబంధం వెంటాడుతోంది. భగవాన్ ఏ స్థితిని అయితే పొందారో ఆ స్థితిని మనం కూడా పొందేవరకు ఆయన మనలను వెంటాడతాడు,

వాడు గురువు. మీ శరీరం ఇంక ఎంతోకాలం ఉండేటట్లు లేదు ఎవరు మమ్మల్ని అనుగ్రహిస్తారు అని భగవాన్‌తో అంటే ఆయన ఏమి చెప్పారు అంటే ఈ శరీరమా మిమ్మల్ని అనుగ్రహించేది ఈ శరీరం ఉన్నప్పుడు కూడా మిమ్మల్ని అనుగ్రహించేది శరీరంకాదు, శవం ఏమి అనుగ్రహిస్తుంది. ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తుందో దానికి చావు లేదు. భగవాన్ దేహంపోతే ఆయనతో మనకు ఉన్న అనుబంధం పోతుంది అని అనుకోవద్దు. భగవాన్ దేహం అయితే ఆ దేహం పోయినప్పుడు ఆయనతో అనుబంధం కూడా పోతుంది. ఆయన దేహం కాదు కాబట్టి ఆ దేహం పోయినా అనుబంధం కంటిన్యూ అవుతుంది. ఈరోజు భగవాన్ చెప్పిన మాట ఒకటి గుర్తు పెట్టుకోండి. అసలు మీరు మనస్సును లెక్కచేయవద్దు ఎందుచేతనంటే అది మీరు కాదు. మనస్సే మిమ్మల్ని మాయ చేస్తుంది అందుచేత మనస్సును లెక్కచెయ్యవద్దు. కాని మనం ఎక్కడకు వెళ్ళిన ఈ మనస్సును భుజాన వేసుకొని తిరుగుతున్నాము. పోనీ ఈ దేహం చనిపోయిన తరువాత అయినా అది మనలను విడిచిపెడుతుందా అంటే అది విడిచిపెట్టదు అది మన కూడా వచ్చేస్తుంది. మనం అమృతానుభవం పొందకుండా ఎవరో ఇతరులు అడ్డురావటం లేదు, మీ మనస్సే మీకు అడ్డు వస్తోంది.

మనందరం పొరపాటు చేస్తున్నాము మనకు తలంపు ఉంటే ఆ పని జరుగుతుంది గాని తలంపు లేకపోతే జరుగదు అనుకొంటాము. మీరు ఇంటికి వెళ్ళి ఆలోచించుకోండి. మనకు తలంపు లేకుండా, కోరిక లేకుండా ఒకోసారి పని జరిగిపోతుంది. ఒకోపని మనం ఎంత కోరికపెట్టుకొని చేసినా అది అవ్వదు. ఇంక అప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నావు. నీ తలంపు లేకుండా ఆ పని అయిపోతూ ఉంటే ఆ చేసేవాడు ఎవడు? వాడే పరమాత్మ, వాడే ఈశ్వరుడు. నీకు ఇష్టం ఉన్నా, ఇష్టంలేకపోయినా నువ్వు ఆయన చేతిలో పని ముట్టువు. మీకు ఇష్టం లేనిపని అయినా ఆయన సంకల్పం ప్రకారం జరుగుతుంది కాని మీ సంకల్పం ప్రకారం జరుగదు. ఈ దేహం ఏ పని చేయటానికి వచ్చిందో ఆ పని ఆ దేహం ద్వారా జరిగిపోతూ ఉంటుంది అయితే ఇక్కడ రమణుడు చెప్పిన టెక్నిక్ ఏమిటి అంటే దానితో నువ్వు తాదాత్మ్యం పొందవద్దు. నిన్ను ఎవరైనా పొగిడినా పట్టించుకోవద్దు, ఎవరైనా విమర్శించినా పట్టించుకోవద్దు. దేహంతో తాదాత్మ్యం వదిలేయి, దాని పని ఏదో అది చేసుకొని చనిపోతుంది. మేము అందరికంటే గొప్పవారము అని కొంతమంది అనుకొంటూ ఉంటారు, మనలను గౌరవించమంటారు, వారిని గౌరవించకపోతే ఊరుకోరు. ఇటువంటి లక్షణాలు మనకు కూడా ఉంటాయి. ఎదుటివారిచేత గౌరవించబడాలి అనేది ఒక స్వాతిశయం. అది చాలా చెడ్డ అలవాటు. కొంతమంది వారిని వారే పొగుడుకొంటారు, వారిని పొగిడేవారు ఎవరూ కనబడరు. దాని వలన దేహాభిమానం

పెరిగిపోతుంది. సాధన యొక్క లక్ష్యం ఏమిటి అంటే మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానం తగ్గాలి.

మిమ్మల్ని మీరు స్తోత్రం చేసుకోవద్దు. డంబం పనికిరాదు. మానసికంగాకాని, శారీరకంగాకాని ఇతరులను హింసపెట్టకూడదు. భూమికి ఎంత సహనం ఉందో రాముడికి అంత సహనం ఉంది అని చెపుతారు. రాముడి యొక్క వైభవం ఎటువంటిది అంటే తపస్సులు చేసి, తపస్సులు చేసి పొందే స్థితిని రామనామం చేయటం వలన మీరు పొందవచ్చు. మీరు ఎన్ని తపస్సులు చేసినా సహనం లేకపోతే అవి ఫలించవు. జ్ఞానం సహనం ఉన్నవాడిని వరిస్తుంది కాని సహనం లేనివాడి దగ్గరకు అది వెళ్లదు. మోక్ష మార్గంలో ప్రయాణించేవాడికి పట్టుదల ఉండాలి, ధైర్యం ఉండాలి, పిరికివాడి వలన ఏదీ సాధ్యం కాదు. మీరు సిన్సియర్‌గా సాధన మొదలుపెట్టారు అనుకోండి, మీ ఇంట్లోనివారు ముందు శత్రువులు అవుతారు. సత్యాన్వేషకుడికి ముందు ఇంట్లోనే శత్రువులు ప్రారంభమవుతారు. మీరు ఎన్ని శాస్త్రాలు చదివినా మనోనిగ్రహం ముఖ్యమని చెపుతున్నారు కదా. మనోనిగ్రహం ముఖ్యమని తెలిసిన తరువాత కూడా మనోనిగ్రహానికి ప్రయత్నం చేయకుండా వూరికే శాస్త్రాలు చదవటం వలన ప్రయోజనం ఏమిటి అన్నారు భగవాన్. గాలిని మూట కట్టటం ఎంత కష్టమో మనోనిగ్రహం అంత కష్టం అని చెపుతారు. దానికి అభ్యాసం, వైరాగ్యం ఉండాలి. పూర్వజన్మ సంస్కారములను బట్టి మనస్సు బయటకు పోతూ ఉంటుంది, అది ఎక్కడికి పోతుందో పట్టుకుని అక్కడ నుండి దానిని వెనుకకు తీసుకొనివచ్చి దాని స్వస్థానంలో ఉంచాలి.

వినాయకుడి గుడి దగ్గర ఎలుక ఉంటుంది. అది వినాయకుడి వంక స్టడీగా చూస్తూ ఉంటుంది. ఎలుక చెప్పినట్లు వినాయకుడు వినటంకాదు, వినాయకుడు చెప్పినట్లు ఎలుక వింటోంది. దీని అర్థం ఏమిటి అంటే మీరు చెప్పినట్లు మనస్సు వినాలిగాని మనస్సు చెప్పినట్లు మీరు వినకూడదు. మీరు చెప్పినట్లు మనస్సు వింటే అది కాలి బూడిద అయిపోతుంది. ఎలుక ఎప్పుడూ కుదురుగా ఉండదు కాని వినాయకుడి దగ్గర చాలా స్టడీగా ఉండి వాడి వంక చూస్తూ ఉంటుంది. మీ మనస్సు కూడా అలాగ ఉంటే, ఆ ఏకాగ్రతను సంపాదిస్తే జ్ఞానసముపార్జనకు ప్రిపేర్ అవుతుంది. నెయ్యి పోస్తూ అగ్నిని ఆర్పలేము, నెయ్యి పోసేకొలది అగ్ని పెరిగిపోతుంది. అలాగే కోరికలను తీర్చుకొంటూ కోరికలను జయించలేము. మీరు మాట్లాడే మాటలో, చేసే పనిలో వ్యక్తిభావన వ్యక్తం అవ్వకూడదు. వ్యక్తిభావన వ్యక్తమవుతూ ఉంటే మీరు అజ్ఞానంలో కూరుకునిపోతారు. శరీరం పుడుతుంది, శరీరం ముసలిది అవుతుంది, శరీరం చనిపోతుంది. శరీరంలో ఎన్నో వికారాలు వస్తూ ఉంటాయి, దానికి రకరకాల జబ్బులు వస్తాయి. ముసలితనం

వచ్చాక ఇంట్లోవారు పట్టించుకోరు, తిడుతూ ఉంటారు. ఎవరో చుట్టాలు వెళ్ళినప్పడు వారికి పౌడరు వ్రాసి, తలదువ్వుతూ ఉంటారు, తరువాత వీడు ఎప్పడు పోతాడు అని కనిపెట్టుకొని ఉంటారు. ఇంకా చావు రావటం లేదు అని వీడు చూస్తూ ఉంటాడు. వాడు ఎందుకు వెళతాడు ఎన్ని తిట్లు తినాలో అన్ని తిట్లు తింటేనేగాని వాడు బయటకు వెళ్ళడు. మీ జీవితంలో ఎన్ని బహుమానాలు పొందాలో, ఎన్ని అవమానాలు పొందాలో అన్నీ పూర్తి అయితేగాని మీ ముక్కులో గాలిని భగవంతుడు బయటకు తీయడు. అందుచేత శరీరంలో ఉన్న దోషాలను కూడా మీరు గుర్తించాలి.

మీ మనస్సు, మాట, చేత ఏకంగా ఉండాలి. మీరు చేయవలసిన డ్యూటీ మీరు చేయాలి, ఆసక్తి పెట్టుకోవద్దు. ఇవన్నీ జ్ఞానం పొందటానికి లక్షణాలు, వీటిని మీరు సంపాదించుకోవాలి. మీరు ఆత్మాన్వేషణలో ఉంటే, బ్రహ్మానుభవం పొందాలి అనే తపన ఉంటే ఈ లక్షణాలు అన్నీ మామూలుగానే వచ్చేస్తాయి, పెద్ద కష్టపడి సంపాదించుకోనక్కరలేదు. మీ శరీరం ఎక్కడ ఉందో మనస్సు అక్కడ ఉండాలి. అతి స్నేహాలు వద్దు, మధ్యేమార్గంలో ఉండండి. ప్రతీ మనిషికి కూడా కొంత ఏకాంతవాసం ఉండాలి, ఏకాంతవాసంలో మన మనస్సులో ఏముందో మనకు తెలుస్తూ ఉంటుంది. మనస్సును స్వచ్ఛంగా ఉంచుకోండి. అద్దం మీద దుమ్ము లేకుండా ఉంటే మీ మొఖం బాగా కనిపిస్తుంది. అలాగే మీ మనస్సు నిర్మలంగా ఉంటే, స్వచ్ఛంగా ఉంటే మీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీకు స్ఫురిస్తూ ఉంటుంది. స్వచ్ఛమైన మనస్సులో ఉన్న ప్యూరిటీ యొక్క వైభవం అటువంటిది. జీవితంలో ఏది ఎదురువచ్చినా సమానంగా ఉండండి. ఈశ్వరుడి మీద భక్తి పెంచుకోండి, ప్రేమ పెంచుకోండి. భగవంతుడిని మీరు కోరికలు ఏమీ కోరవద్దు. భక్తి అనేది, ప్రేమ అనేది వ్యాపారంగా ఉండకూడదు. ప్రారబ్దంలో చెడ్డ అనుభవించవలసి వస్తే భగవంతుడు కూడా లేడేమో అని మీకు అనిపిస్తుంది, మీ భక్తి అలా ఉండకూడదు. మీ భక్తి ఎప్పడూ ఒకేరకంగా ఉండాలి, స్థిరంగా ఉండాలి.

మీరు పనిచేస్తూ ఉండాలి, మనిషి కనబడకూడదు. మీ నామరూపాలను శుభ్రంగా పచ్చడి చేసేయండి అన్నారు భగవాన్. మనిషిని బంధించేది నామం, రూపం. మీ నామం మీద, మీ రూపం మీద మమకారం పోయింది అనుకోండి, మీరు రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలోనుండి బయటకు వచ్చేసారు అనుకోండి మీరు పరమాత్మ ఒడిలో పడిపోతారు. నామరూపాలను పచ్చడి చేసి వదిలేయండి, అదే సాధన. ఆహారనియమంకంటే మించిన నియమం లేదు. శరీరానికి ఎంత అవసరమో అంతే తినాలి. మన శరీరం కూడా మనకు గురువే. సరిపడ తిన్నాక ఇంక వద్దు అని శరీరం చెపుతుంది కాని రుచికోసం ఎక్కువ

తినేస్తాము తరువాత బాధపడేది పొట్ట. పొట్టపడే బాధ నోరుకు తెలియదు. మీరు లోపలకు వెళ్ళేవి శుచిగా ఉండాలి అనుకొంటున్నారు. లోపల నుండి వచ్చే మాటలు శుచిగా ఉండనక్కరలేదా? బయట నుండి లోపలకు వెళ్ళే వస్తువులు ఎంత శుచిగా ఉండాలో లోపల నుండి బయటకు వచ్చే మాటలు కూడా అంత శుచిగా ఉండాలి, అక్కడ మాటలో మీ హృదయం ఉండాలి. ఒకమాట మాట్లాడితే ముందు పదిసార్లు ఆలోచించి తరువాత ఆ మాట మాట్లాడు. మీరు మాట్లాడే మాట మీకు పుణ్యం తీసుకొనిరావాలికాని పాపం తీసుకొని రాకూడదు. అందుచేత మీకు వచ్చే తలంపుల విషయంలో, మాట్లాడే మాటల విషయంలో, చేసే పనుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మీ ఇష్టదైవం ఎవరైనా సరే రమణుడో, రామకృష్ణుడో, రాముడో, కృష్ణుడో ఎవరిమీద మీ మనస్సు నిలబడితే ఆయన నామాన్ని స్మరించుకొంటూ, ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ మీరు పవిత్రులైతే, మీరు పునీతులైతే అప్పుడు మోక్షం కావాలి అని మీరు అడుగనక్కరలేదు, మోక్షమే వచ్చి మిమ్మల్ని వరిస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 06-09-09, చింతపర్రు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇది కలియుగం. ఈ కలియుగంలో మోక్షమార్గంలోనికి రావటమే కష్టం, ఒకవేళ వచ్చినా నిలబడియుండటం మరీ కష్టం, ఒకవేళ నిలబడినా మోక్షాన్ని అందుకోవటం ఇంకా కష్టం. మీరు సాధన చేస్తున్నా, మీరు దేనికోసం అయితే ప్రయత్నం చేస్తున్నారో అది అంతా అసత్యం అని ఎవరైనా చెపితే మరల మన మనస్సు అంతా మారిపోతుంది. ఎందుచేతనంటే మనకు సొంతఆలోచన లేదు, అది కలియుగదోషం. మిగతా యుగాలకంటే ఈ కలియుగంలో మనస్సును నియమించుకోవటం కొంచం కష్టంగా ఉంటుంది. మనస్సు ఎటు అయినా చిక్కే. గాఢనిద్రలో మనస్సు ఏమీ గొడవలేకుండా అలా పడి ఉంటుంది, అప్పుడు సాధన చేయుటానికి అవకాశం లేదు. పోనీ జాగ్రదవస్థలో ఏమైనా సాధన చేస్తుందా అంటే దాని వాసనలను బట్టి అలా తిరుగుతూ ఉంటుంది, ఒక్క క్షణం కూడా కుదురుగా ఉండదు. ఒకవేళ ఆలోచించినా మోక్షం గురించి ఆలోచించదు. కామ్యకర్మల గురించి, నామరూపాల గురించి ఆలోచిస్తుంది. ఏదోవిధంగా అలా బయట తిరుగుతూ రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా నొల్లుకొని వస్తూ ఉంటుంది అంటే దానికి విషయచింతన, భోగచింతన ఎక్కువగా ఉంటుంది. మనస్సును కుదురుగా ఉంచటానికి కొంతమంది ప్రాణాయామం చెపుతారు, కొంతమంది నామజపం చెయ్యమని చెపుతారు. జాగ్రదవస్థలో మనస్సుకి స్థిరత్వం

సంపాదించి, నిర్మలత్వం సంపాదించి, మనస్సును ఏకాగ్రం చేస్తే అప్పుడు సమాధిస్థితి వస్తుంది. సమాధిస్థితిలో మనకు నామచింతన, రూపచింతన పోతాయి, ఎందుచేతనంటే రూపం, నామం ఆ రెండూ తానుకాదు, ఆ రెండూ కల్పితములే అని వాడికి తెలుస్తూ ఉంటుంది. సమాధిస్థితి వస్తేనేగాని మనిషికి శాంతిలేదు, మోక్షం లేదు.

మనకు నేను అనే తలంపు, నాది అనే తలంపు ఉన్నాయి. మనం ఏదిగా ఉన్నామో దాని తాలుక ఎరుక మనకి వచ్చే వరకు నేను అనే తలంపు, నాది అనే తలంపు ఇవి రెండూ దగ్ధం కావు. సజ్జనసాంగత్యం చేస్తేగాని ఈశ్వరుడి పట్ల మనకు భక్తి రాదు. ఈశ్వరుడిపట్ల మనకు భక్తి కలిగాక దానిని జాగ్రత్తగా మనం కాపాడుకోవాలి. నిష్కామభక్తిని ప్రాక్టీసు చేస్తే కొత్తసంస్కారాలు రావు, పాతసంస్కారాలు ఒకోటి కాలిపోతూ ఉంటాయి. మనకు ఈశ్వరుడిపట్ల భక్తి ఉండాలి, ప్రేమ ఉండాలి, కారణం కనబడకూడదు, అప్పుడు మనస్సు దహించబడుతుంది. దేహప్రారబ్ధాన్ని బట్టి ఏదో ఒకటి వస్తూ ఉంటుంది. ఏది వచ్చినా అది అంతా స్వప్నమే, దాని ప్రభావం మనస్సుమీద పడకుండా చూసుకోవాలి. బయట ఏవో సంఘటనలు జరుగుతూ ఉంటాయి, వాటి ప్రభావం మనస్సుమీద పడకుండా చూసుకొంటే మనస్సు నిర్మలమవుతుంది. మనకు అనుకూలమైన మాటలు విన్నా ప్రతికూలమైన మాటలు విన్నా వాటిని లోపలకు తీసుకోకూడదు, వాటిని బయటే వదిలేయాలి. అప్పుడు మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది. ఓ శ్రీహరీ! నాకు నీ మీద ఉన్న భక్తి వలన మా పిన్నమ్మ ఏ మాటలు అన్నా, ఇతరులు ఏమన్నా ఆ మాటల ప్రభావం నామీద పడటంలేదు. అది నా తెలివితేటలు కాదు, నీ దయవలన ఆ మాటల ప్రభావం నా మీద పడటం లేదు. నీ నామాన్ని నిరంతరం స్మరించటం వలన నాకు ఆ శక్తి కలిగింది అంటాడు ధృవుడు.

కొంతమందికి దూరపు ఆలోచన ఉండదు. ఈవేళ సాధన చేసాము, రేపు మోక్షం వచ్చేయాలి అంటే కుదరదు, దానికి దీర్ఘమైన ప్రణాళిక ఉండాలి, ఆ ప్రణాళిక ద్వారా మనం నడుచుకోవాలి అంతేగాని ఈ రోజు ఏదో సంతోషం వచ్చిందని సాధన వదిలేసి, ఈ రోజు కష్టం వచ్చిందని సాధన వదిలేసి ఒక గమ్యం లేకుండా మనం ఉంటే మనం ఫెయిల్ అయిపోతాము. అది సాధించేస్తున్నాను, ఇది సాధించేస్తున్నాను అనుకొంటున్నావు, మరణం అనే పెద్ద తాచుపాము నీ వెనకాలే ఎప్పడూ ఉంటుంది, అది నిన్ను తరుముకు వస్తోంది, ఎప్పడు కాటేస్తుందో చెప్పలేము, టైము వచ్చినప్పడు కాటేసేస్తుంది, అందువలన సాధనలో బహుజాగ్రత్తగా ఉండాలి. మంచికర్మ చేయటం వలన, చెడ్డకర్మ వలన వచ్చే ఫలితాన్ని అది పోగొట్టగలదా అని అడిగితే మంచికర్మ చేయటం వలన, చెడ్డకర్మ వలన వచ్చే ఫలితం రాకుండా పోదు కాని దానివేగం తగ్గుతుంది అని ఒక మహాత్ముడు చెప్పాడు. ఇంకో మహాత్ముడు ఏమని చెప్పాడు అంటే ఆ వేగం తగ్గటం,

తగ్గకపోవటం గొడవ ఎందుకు? తత్వజ్ఞానం కలిగితే ఏ కర్మలేదు అన్నాడు. అంటే నీకు స్వరూప జ్ఞానం కలిగితే ఏ కర్మ అయినా అందులో కాలిపోతుంది. ఇది ఇలా ఎందుకు జరిగింది, అది అలా ఎందుకు జరిగింది అని భక్తుడు అనుకోడు. అలా జరగవలసి ఉంది జరిగింది అనుకొంటాడు, అది భక్తుడు లక్షణం. ఈశ్వరసంకల్పం అతి బలీయమైనది. ఈ జీవకోటి, ప్రపంచం అంతా ఆయన స్వాధీనంలో ఉన్నాయి.

మనం అంతా తోలుబొమ్మలం అంటున్నాడు. తోలుబొమ్మ దాని ఇష్టంవచ్చినట్లు ఆడటానికి కుదరదు. తోలుబొమ్మలను ఆడించటానికి తెరవెనకాల ఒకడు ఉంటాడు, వాడు ఎటుగెంటితే ఆ బొమ్మ అటువెళుతుంది. ఒకవేళ అక్కడే సుఖంగా ఉందామన్నా ఆ బొమ్మ ఇష్టంకాదు, బొమ్మ వెనకాల గెంటేవాడు ఎటోగెంటేస్తాడు, అటుపోవలసిందే. అలాగే మనలను నడిపేవాడు లోపల ఒకడు ఉన్నాడు. మన దేహప్రారబ్ధాన్ని బట్టివాడు మనలను గెంటేస్తూ ఉంటాడు. తోలుబొమ్మలకు స్వతంత్రం ఉంది అనుకోవటం ఎటువంటిదో మనకు స్వతంత్రం ఉంది అనుకోవటం కూడా అటువంటిదే. మనం తెలివైనవారము, ఇదేమిటి మనలను తోలుబొమ్మలు అంటున్నారు అని మనం ఆ మాటలను అంగీకరించము. మనం తెగిపోయిన గాలిపటాలలాగలేము, మనం ఈశ్వరుడి కంట్రోలులో ఉన్నాము. ఈశ్వరసంకల్పాన్నిబట్టి అంతా జరుగుతుంది. మనం అంగీకరించినా, అంగీకరించకపోయినా ఈశ్వర సంకల్పమే జరుగుతుంది. ఈశ్వరసంకల్పాన్ని మనం అంగీకరిస్తూ ఉంటే దేహబుద్ధి నెమ్మదిగా తగ్గిపోతుంది. శరీరం ద్వారా జరగవలసిందిఏదో జరుగుతుంది కాని మీకు ఒక స్వేచ్ఛ ఉంది. మీరు దేహంతోటి, మనస్సుతోటి తాదాత్మ్యం పొందకండి. మనస్సుతో తాదాత్మ్యం పొందటం మానేస్తే అది కాలిబూడిద అయిపోతుంది. ఇతరుల గొడవ మీకు ఏమీ అక్కరలేదు, ఇంట్లోవారికే పరిమితమైపోతారు. వారు అందరూ సుఖంగా ఉంటే, మనం కూడా సుఖంగా ఉన్నాము అనుకొంటారు, వారికి దుఃఖం వస్తే మీకు కూడా దుఃఖం వచ్చేస్తుంది. దేహాభిమానంలోనుండి ఇవి అన్నీ వస్తున్నాయి. దేహాభిమానం నశించకుండా మీకు మోక్షం రాదు.

మీకు ఎప్పుడైనా సంతోషం వస్తే అది జీవలక్షణం, దుఃఖం వస్తే అది జీవలక్షణం, గర్వం వస్తే అది జీవలక్షణం, మన జీవితంలో వచ్చే హెచ్చుతగ్గులు అన్నీ జీవలక్షణాలే. ఈ జీవలక్షణాల నుండి విడుదల పొందకుండా నీకు జ్ఞానంరాదు. నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నీ మనస్సు హృదయంలో అణిగిఉండాలి. గాఢనిద్రలో మనకు తెలియకుండా మన మనస్సు హృదయంలో పడిపోతుంది, అలా జాగ్రదవస్థలో మన మనస్సు హృదయంలో ఉండాలి, అదే సాధన. పూర్వజన్మలలో మనం ఏ మార్గంలో సాధన చేసామో ఆ మార్గం మీద ఇప్పుడు మనకు ఇష్టం కలుగుతుంది, ఆ

మార్గం తేలిక అని మనకు అనిపిస్తుంది. కొంతమందికి భక్తిమార్గం అంటే ఇష్టం, కొంతమందికి కర్మమార్గం అంటే ఇష్టం. రామానుజాచార్యులుకు శరణాగతి అంటే ఇష్టం, గతి అల్లా శరణాగతే ఇంకోగతి లేదు అంటారు. ఎవడు ఏ కృషి చేసినా పది రూపాయలు సంపాదించటానికే కదా అలాగే నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నీ మనస్సు వెళ్ళి హృదయంలో అణగాలి. అక్కడ అణగదు అనుకో, అక్కడ ఉండదు అనుకో అది నశించదు. శరీరానికి అన్నం ఎటువంటిదో మనస్సుకు నామరూపములు అటువంటివి. మీరు 40 రోజులు అన్నం తినకపోతే చనిపోతారు అలాగే రూపచింతన, నామచింతన వదిలేస్తే మనస్సు నశించిపోతుంది. ఈ నామరూపములను పచ్చడికింద చేసేయి అంటున్నారు భగవాన్.

మీకు దుఃఖం రావటానికి 90 కారణాలు అంటూ లేవు ఒక్కమోహం ఉంటే చాలు, చనిపోయేవరకు జీవితం పొడుగునా ఏడుస్తూనే ఉంటావు. మోహం ఏదో రకంగా జీవుడికి దుఃఖం తీసుకొని వస్తుంది. నీకు మోహం లేదు అనుకో ఇంక ఏడవటానికి కారణం కనబడదు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నీకు పూర్తిగా నమ్మకంగా ఉంటే ఆయనకు శరణాగతి చెయ్యి. నీకు ఆ నమ్మకం లేదు అనుకో నీకు అశాంతి ఎందుకు వస్తోందో కారణాన్ని శోధించు, ఆ కారణాన్ని చింపేయి. ఈ కారణాలు అన్నీ ఎక్కడ ఉన్నాయి అంటే మనస్సులో ఉన్నాయి, మనస్సును చింపేయి ఇంక ఏమీ మిగలదు. అశాంతి అంటే మనకు ఇష్టం ఉండదు ఎందుచేతనంటే మన స్వరూపంలో అశాంతి లేదు. మీకు ఎక్కడా బంధం లేదు అనుకోండి ఇంక మీకు అశాంతి రాదు. దుఃఖంలేని పదార్థం అంటూ ఉంటే అది బ్రహ్మం ఒక్కటే. నీకు ఉన్న భక్తి కనుక నిజమైతే, ఈశ్వరుడి పట్ల నీకు ఉన్న ప్రేమ కనుక నిజమైతే ఈశ్వరుడు ఎన్నడూ నిన్ను విడిచిపెట్టడు. ఈశ్వరుని దయను కొంత మీరు రుచిచూస్తే పంచదారలో పడ్డ చీమలులాగ అక్కడే పడి ఉంటారు. పంచదారలో పడ్డ చీమను బయటకు రమ్మంటే రాదు. అలాగే ఈశ్వరుని దయ తాలుక ఆ స్పర్శ మీకు తెలిస్తే అందులోనుండి ఇంక మీరు బయటకు రాలేరు. మీకు శాంతి కావాలి, సుఖం కావాలి. మీకు ఎంత కావాలో అంత మీ హృదయంలో నుండే సప్లయి అవుతూ ఉంటే ఇంక వాండరింగ్ అక్కరలేదు. అయితే శాంతి, సుఖం అనేది బయట ఎక్కడా లేదు, మన హృదయంలోనే ఉంది అనే నమ్మకం కూడా మనకు కలగటంలేదు. ఆ నమ్మకం కలగాలంటే ఈశ్వరుని అనుగ్రహం ఉండాలి.

మా అబ్బాయి చాలా బుద్ధిమంతుడు అని మీరు అనుకొంటారు దాని వలన మీకు సంతోషం వస్తుంది అనుకోండి. కొంతకాలం తరువాత మీకు దుఃఖం వచ్చేస్తుంది ఎందుచేతనంటే వాడు ఎప్పుడూ బుద్ధిమంతుడు కింద ఉండడు. వాడూ జీవుడే, వాడికీ గుణాలు ఉంటాయి, ఆ గుణాలు

ఎలా ఆడిస్తే అలా ఆడుతూ ఉంటాడు. ఈరోజు ఉన్నట్లు రేపు ఉండకపోవచ్చు. మీ అబ్బాయి మంచివాడు అయితే, బుద్ధిమంతుడిగా ఉంటే ఉండనివ్వండి కాని మీ సుఖంకోసం ఎప్పడూ వాడిమీద ఆధారపడవద్దు. మీ సుఖంకోసం వాడిమీద ఆధారపడితే ఎప్పటికైనా మీకు దుఃఖం వచ్చి తీరుతుంది. మీ అబ్బాయిలే కాదు ఎవరైనా అంతే. ఇక్కడ సబ్జక్టు ఏమిటి అంటే మనం సుఖం కోసం బయట విషయాలమీద ఆధారపడకూడదు, అలా ఆధారపడితే మరల రెట్టింపు దుఃఖం వచ్చేస్తుంది. సుఖం అనేది మీ హృదయంలో ఉంది అక్కడ వెతుక్కోండి, అది మీకు దొరుకుతుంది. సముద్రంలో ఎంత నీరు ఉందో అంత సుఖం మీ హృదయంలో ఉంది. అక్కడ వెతుక్కోవటం మానేసి మీరు గుంటలలో, బోదులలో తిరుగుతారు ఎందుకు? భగవంతుడికి శరణాగతి చేసాము అనుకోండి, శరణాగతి చేసాక అప్పడు మనస్సు ఎలా ఉంటుంది అని ప్రశ్న. అదే తింగర ప్రశ్న. నువ్వు ముందు భగవంతుడికి శరణాగతి చేసి చూడు. శరణాగతి చేస్తే మనస్సు ఎలా ఉంటుందో నీకే తెలుస్తుంది. నువ్వు శరణాగతి చెయ్యకుండా కబుర్లతోటి కాలక్షేపం చేస్తావు ఏమిటి? పంచదార నోటిలో పోసుకోమంటున్నాను. నోటిలో పోసుకొన్నాక అది తియ్యగా ఉంటుందో, ఎలా ఉంటుందో నీకే తెలుస్తుంది కదా, నన్ను అడగటం ఎందుకు? శరణాగతి చెయ్యకుండా, శరణాగతి చేస్తే నామనస్సు ఎలా ఉంటుంది అని అడుగుతావు ఏమిటి? అది అర్థం లేని ప్రశ్న అంటున్నారు.

ఫలానా శరీరం నాది, ఫలానా ఇల్లునాది, ఫలానా ఊరునాది అని ఇలా బాహ్యంగా ఏదో ఒక దానితో తాదాత్మ్యం ఉన్నంతకాలం మీకు కోరికలు ఆగవు. నీకు దేహాభిమానం ఉన్నప్పడు కోరిక ఆగదు. మీ హృదయంలో ఉన్న సుఖం మీకు అందింది అనుకోండి శరీరం చనిపోయినప్పడు కూడా మీకు ఏమీ అనిపించదు. ఎందుచేతనంటే మీకు ఆ సుఖంతో తాదాత్మ్యం ఉంటుంది కాని శరీరంతో తాదాత్మ్యం ఉండదు. అప్పడు మరణం మిమ్మల్ని ఏమీ చేయలేదు. మీరు మరణాన్ని జయిస్తారు అంటే శరీరం మరణించినప్పడు నేను చనిపోతున్నాను అనే తలంపు మీకు రాదు. ఎందుచేతనంటే ఆ శరీరం మీరు కాదు అని మీకు తెలుస్తూ ఉంటుంది. వారిని ఉద్ధరించాలి, వీరిని ఉద్ధరించాలి అనుకొంటాము. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే నువ్వు పుట్టకముందు ఈ ప్రపంచం ఉంది, నువ్వు చనిపోయాక కూడా ఈ ప్రపంచం ఉంటుంది. నువ్వు పుట్టకముందు ఈ ప్రపంచాన్ని ఎవడు చూసాడో నువ్వు చనిపోయాక కూడా ఈ ప్రపంచాన్ని వాడే చూస్తాడు. ఇంక నువ్వు ఉద్ధరించేది ఏముంది? ఈలోపుగా నువ్వు కంగారు పడతావు ఏమిటి? నేను లేకపోతే ఈ పని అవ్వదేమో అంటాడు. అదే కర్తృత్వం, అది ఉన్నంతసేపు దుఃఖం వాడిని విడిచిపెట్టదు. నువ్వు లేకపోతే నీకంటే మంచివారిని ఈ సృష్టిలోనికి భగవంతుడు పంపవచ్చు. భవిష్యత్‌లో మనకంటే బుద్ధిమంతులు

రావచ్చు. అది అంతా భగవంతుడు చూసుకొంటాడు. అది నీకు తెలియక కంగారుపడుతున్నావు.

పురాణాలలో ఏమని చెపుతారు అంటే నీకు చేతులు, కాళ్ళు ఉన్నా చేతులతో సత్కర్మ చేయకపోతే, కాళ్ళతో మంచి క్షేత్రాలకు వెళ్ళకపోతే అవి శవానికి ఉన్న చేతులతోటి, కాళ్ళతోటి సమానం అని చెపుతారు. శవానికి కాళ్ళు, చేతులు ఉంటాయి కాని అవి ఎందుకు పనికిరావు నీకాళ్ళు, చేతులు కూడా అంతే అని చెప్పటం. కాళిదాసు ఏమని చెప్పాడు అంటే ఇంద్రియాలకు ఎన్ని భోగాలు ఉండాలో అన్ని భోగాలు ఎదురుగుండా ఉండాలి, మీకు వికారం కలుగకూడదు. అంటే అన్నీ అందుబాటులో ఉన్నా మీ మనస్సు నిర్మలంగా ఉండాలి, ఇంద్రియాలలో ప్రకోపం ఉండకూడదు. అదీ ఇంద్రియనిగ్రహం అన్నాడు. మిగతావి అన్నీ దొంగ నిగ్రహాలు అని చెప్పాడు. శ్రీకృష్ణచైతన్య పూరీజగన్నాథ్‌లో ఉండేవాడు. ఆయన నోటిలో పంచదారవేసి మరల చేతితో ఆ పంచదారను లాగేసుకోవచ్చు, అందులో ఒక్కకణం కూడా తడి అవ్వదు. అదీ ఇంద్రియనిగ్రహం, ఆయన కృష్ణభక్తుడు. మీరు చేస్తున్నపని మిమ్మల్ని బంధించదు, ఆ పనినేను చేస్తున్నాను అనే తలంపు మిమ్మల్ని బంధిస్తుంది. నీ శరీరం ద్వారా ఏ పని జరగాలి అని భగవంతుడు నిర్ణయించాడో, మీ శరీరంపట్ల ఏ ప్రణాళిక వేశాడో ఆ ప్రణాళిక ప్రకారం శరీరం నడిచి ఆ పని చేసి అది చనిపోతుంది. నా ప్రారబ్దం కొలది అలా దొరికారు అని అనుకోవద్దు. ఆ పని భారం కింద, చాకిరీకింద చేయకు. నీ శరీరం ద్వారా ఆ పని జరగాలి, ఆ పనిని సంతోషంగా చెయ్యి, దుఃఖంగా చెయ్యవద్దు. భగవంతుడు ఆ పనిని మనకు కేటాయించాడు అనుకొని చెయ్యి. ఆ పని ఆయనదే, మనచేత చేయించుకొంటున్నాడు అని చేస్తే నీకు కొత్త వాసనలు రావు. తరువాత నీకు భారం రాదు, తేలికగా ఉంటావు.

దేహం ఉన్నవాడికి బంధువులు, స్నేహితులు, శత్రువులు, ఆ గెడపదాటితే ఏమీ లేదు. దేహభావన మీరు దాటారు అనుకోండి హృదయం అనే గూటిలో పడిపోతారు. అక్కడ యజ్ఞం చేస్తున్నారు, ఇక్కడ యాగం చేస్తున్నారు, అక్కడ భోజనాలు పెడుతున్నారు, ఇక్కడ వ్రతాలు చేస్తున్నారు అంటే మనం పరుగెత్తుకొనిపోతున్నాము, బలహీనత అలా ఉంటుంది. అది గమ్యం కాదని మనకు తెలియటంలేదు. జ్ఞానం ఎవరికీ అక్కరలేదు. మనం గుడికి వెళుతున్నాము. జ్ఞానం కావాలని ఎవరైనా కోరుకొంటున్నారా? ఎవరూ కోరుకోవటం లేదు ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటంలేదు. మీ దేహం ఏ పని మీద అయితే ఈ భూమి మీదకు వచ్చిందో మీ కోరికతో సంబంధం లేకుండా ఆ పని చూసుకొని అది చనిపోతుంది. అయితే ఈ వాక్యం మీద మనకు నమ్మకంలేదు. కోరిక లేకపోతే పని అవ్వదేమో అనుకొంటాము. మీ కోరికతో సంబంధం లేకుండా మీ ప్రారబ్ధంలో అది ఉంటే అయిపోతుంది. రమణమహర్షిగారు నాకు మోక్షం కావాలి, జ్ఞానంకావాలి

అని ఏమీ ఆయన కోరుకోలేదు, మరి ఎందుకు వచ్చింది? ఆయన తలంపుతో సంబంధం లేకుండా, సాధనతో సంబంధం లేకుండా వస్తువు ఆయనకు స్ఫురించింది. అందులో కోరిక ఎక్కడ ఉంది. మనకైనా అర్హత ఉంటే, యోగ్యత ఉంటే అది వచ్చేస్తుంది, వరించి వరించి మీద పడుతుంది. మీకు అర్హత లేదు అనుకోండి కోరికలు కోరినా ప్రయోజనం లేదు.

సమాధిస్థితిలో మీ హృదయంలో నుండి మీకు శాంతి అందుతూ ఉంటుంది. మీకు ఎంత శాంతిగా ఉంటుంది అంటే వెయ్యికోరికలు ఒకేసారి నెరవేరితే మీకు ఎంత ఆనందంగా, ఎంత శాంతిగా ఉంటుందో అంతకంటే రెట్టింపు శాంతి మీకు అందుతున్నట్లు అనిపిస్తుంది. అటువంటప్పుడు ఇంక మీకు బయట పనిఏమిటి? మీరు ఆ ఆనందాన్ని, శాంతినే భరించలేనప్పుడు ఇంక ఆనందం కోసం ఎక్కడ తిరుగుతారు. బయట తిరగవలసిన పనే లేదు. మీ చేతిలో ఉన్న పని మీరు చేయండి. నిర్ణయం మీకు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. మీరు నిజంగా భక్తులైతే భగవంతుడి సంకల్పానికి బద్ధులై ఉండండి, దానికి బద్ధులై ఉంటే ఇంక మీకు దుఃఖం రాదు. మీకు సోమరితనం వద్దు. కలియుగంలో మనుషులు సోమరితనానికి అలవాటుపడి మోక్షంకోసం ప్రయత్నం వదిలేసారు. మీకు మరణం ఏరోజు వస్తుందో జ్యోతిష్యుడు చెపుతాడు అనుకోండి. అది ముందే మీకు తెలిసినా ఆ రోజున మరణం రాకుండా మీరు ఆపుచేసుకోలేరు. ఆ రోజున మీరు అపోలో హాస్పిటల్‌లో ఉన్నా చచ్చి ఊరుకుంటారు. అంటే ముందే తెలిసిన ఆపుచేసుకోలేరు. అంటే జీవుడు స్వతంత్రుడు కాదు అని మీకు తెలుస్తుంది. పరీక్షిత్తు వారం రోజులలో చనిపోతాడు అని ముందే తెలుసుకదా కాని పరీక్షిత్తు మహారాజుకు చావు ఆగలేదు, వచ్చేసింది. అయితే ఈ లోపుగా శుకుడు ఏడు రోజులలో భాగవతం చెప్పేసాడు. పాము వచ్చి ఆయనను కరిచింది, చనిపోయాడు. అయితే గురువు ఆయనకు చేసిన ఉపకారం ఏమిటి అంటే పాము వచ్చి కరిస్తే శరీరం చనిపోయినా తాను చావటం లేదు అనే అనుభవం పరీక్షిత్తుకు వచ్చేసింది, ఇంక చావు ఆయనను ఏమి చేస్తుంది. ఆ స్థితికి ఆయనను వారం రోజులలో గురువు తీసుకొనివచ్చాడు, వాడు గురువు. ఊరికే బుడబుక్కల మాటలు చెప్పటంకాదు, గురువు అనుగ్రహం ఆయనను ఆ స్థితికి తీసుకొనివచ్చింది.

ముఖ్యంగా మనం ఈ రోజు చెప్పకొన్నది ఏమిటి అంటే మీరు కష్టపడి పనిచేసుకోండి. భగవంతుడి సంకల్పాన్ని అంగీకరించండి. భగవంతుడి సంకల్పం మీకు అనుకూలంగా ఉంటే పొంగిపోవద్దు, ప్రతికూలంగా ఉంటే కుంగిపోవద్దు, సమానంగా ఉండండి, అప్పడు నెమ్మదిగా మనోనాశనం అయిపోతుంది. తుకారామ్‌కి ఎవ్విరితింగ్ ఈజ్ పాజిటివ్. ఆయన నెగిటివ్ మాటలు అసలు చెప్పడు. మీరు ఎవరినీ ద్వేషించకండి, మీకు అసూయవద్దు అని ఇటువంటి మాటలు

ఆయన చెప్పడు, ప్రేమించటం గురించే చెపుతాడు. నాకు ఈ చెడ్డగుణం ఉంది, ఇది పోవాలి, అది పోవాలి అని ఆయన ఏమీ ప్రయత్నం చేయలేదు. నాకు బంధం ఉంది, సంసారం అంటే ఇష్టం ఉంది ఇవి పోవాలి అని ఆయన ఏమీ అనుకోలేదు. ఆయనకు పాండురంగడిపట్ల ఉన్న ప్రేమలో, ఆప్యాయతలో పోవలసినదంతా పోయింది. పోగొట్టుకోవటానికి ప్రత్యేకంగా ఆయన ఏమీ ప్రయత్నం చేయలేదు, ఆ ప్రేమప్రవాహంలో ఈయన తలంపుతో సంబంధం లేకుండానే, ఆత్మానుభవం పొందటానికి ఏవైతే అడ్డుగా ఉన్నాయో అవి అన్నీ జారిపోయాయి. మనం సాధన చేసి పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. కాని ఆయనకు పాజిటివిటీలోనే అంతాపోయింది. నువ్వు నాకు చేసే సహాయ సహకారములు ప్రక్కన ఉన్న వాడికి కూడా తెలియకుండా అంతా సైలెంట్‌గా చేసావు అరుణాచలేశ్వరుడా అన్నారు రమణస్వామి. అంటే మనం కూడా అలా చేయాలి. ఏసుక్రీస్తు దగ్గరకు ఎవరైనా వచ్చి మీరు ఆ మంచిపని చేసారు, ఈ మంచిపని చేసారు అంటే నువ్వు ఇంటికి వెళ్ళిపో. మీరు మంచిపనులు చేసారు అని చెపుతూ కూర్చోవటంకాదు నేను ఎలా పని చేసాను అని నువ్వు అనుకొంటున్నావో అలాగే చెయ్యటం నువ్వు కూడా నేర్చుకో అని చెప్పేవారు.

ఒక్క భగవంతుడి మీద తప్పించి ఎక్కడా రక్తిపెట్టుకోవద్దు, ఎక్కువ ఇష్టాలు పెట్టుకోకండి. ఎక్కడైనా ఒకచోట ఎక్కువ ఇష్టం పెట్టుకొంటే మరల అయిష్టాలు వచ్చేస్తాయి. మీకు నలుగురు అమ్మాయిలు ఉన్నారు అనుకోండి. ఒక అమ్మాయి మీద ఇష్టం పెంచుకొంటూ వెళితే మిగతా ముగ్గురిమీద ఇష్టం తగ్గిపోతుంది, తగ్గిపోతున్నట్లు కూడా మీకు తెలియదు. ఇష్టం ఉన్నవారికి ఉపకారం చేయటం, ఇష్టంలేనివారికి అపకారం చేయటం, ఇలా ఇష్టాలు అయిష్టాల మధ్య తిరగటం తప్ప నువ్వు సాధించేది ఏమీ లేదా? కీర్తికాంక్ష ఉన్నవారి దగ్గరకు వెళ్ళి సలహాలు అడగవద్దు అని మిల్టన్ చెప్పాడు. వారు ఎంతసేపు మనకు గౌరవం వస్తోందా లేదా, పేరు వస్తోందా లేదా అని చూసుకొంటూ ఉంటారు. వారు వాస్తవపరిస్థితులకు దూరంగా ఉంటారు, అందుచేత మీకు సరియైన సలహాలు ఇవ్వలేరు, వారికి నమస్కారం పెట్టి వదిలేయండి, వారి దగ్గరకి సలహాలకు వెళ్ళవద్దు అని చెప్పాడు. పంచభూతాలు, ఈ జీవకోటి అంతా తోలుబొమ్మలం, వీటిని ఆడించేవాడు నారాయణుడు. ఆయనకు శరణాగతి చేస్తే ఈ ఆటలు ఆగిపోతాయి, మాయలో నుండి బయటకు వచ్చేస్తాము మనం నిరంతరం భగవంతుడిని పూజిస్తూ, ఆయన నామాన్ని స్మరిస్తూ ఉంటే మన మనస్సు నిర్మలం అవుతుంది, నిశ్చలం అవుతుంది, పవిత్రం అవుతుంది, ఏకాగ్రమవుతుంది, అప్పడు ఆయన అనుగ్రహాన్ని పొందుతాము. ఎప్పుడైతే ఆయన అనుగ్రహం వలన మనం మాయను అతిక్రమించామో అప్పడు నారాయణుడి స్వరూపం పొందుతాము, అదే మోక్షం.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | | |
|---|---|---|
| అక్టోబర్ | 19 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| నవంబర్ | 08 | పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# ద్వంద్వాలు ఎవరికి?

గురువు యొక్క సమక్షంలో ఒక్కొక్క సందర్భంలో పరమశాంతికి లోనవుతూ ఉంటాం. కాని ఆశాంతి ఎంతోసేపు నిలవదు, మళ్ళీ ద్వంద్వాల వలయంలోకి వచ్చేస్తాం. 'లాభం-నష్టం', 'ఇష్టం-అయిష్టం', 'మంచి-చెడు', 'సుఖం-దుఃఖం', 'వెలుతురు-చీకటి' లాంటి ద్వంద్వాల చక్రం తిరుగుతూనే ఉంటుంది. ద్వంద్వాల చక్రంలో ఏది స్థిరంగా ఉండదు. సుఖం వచ్చింది అంటే ప్రక్కనే దుఃఖం ఉందని అర్థం. కాని మనము ద్వంద్వాలలో ఒక్క దానినే కోరుకుంటాం, ఉదాహరణకు ఇష్టం, సుఖం, లాభం వంటివి. ఇష్టమైనవి ప్రాప్తించాలని, అయిష్టమైనవి దూరంకావాలని కోరుకొంటాం. కాని ద్వంద్వాలు ఒకే నాణెమునకు రెండు ముఖాలు లాంటివి, అనగా ద్వంద్వాలలో సుఖాన్ని కోరుకుంటే ప్రక్కనే దుఃఖాన్ని ఆహ్వానించినట్లే, అనగా ద్వంద్వాలలో ఒకటి లేకుండా రెండవది ఉండదు. పగలు తరువాత రాత్రి వచ్చే తీరుతుంది. మరి ద్వంద్వాలను అతిక్రమించి శాశ్వతమైన ఆనందాన్ని పొందేది ఎలాగ? అను ప్రశ్న ఉదయించినప్పుడు నిజమైన సాధన మొదలవుతుంది. అసలు ఈ ద్వంద్వాలు ఎవరికి కలుగుతున్నాయి? ద్వంద్వాలు తీసుకొచ్చే సుఖదుఃఖాలను అనుభవించే నేను ఎవరు? అని విచారించి 'దేహాత్మబుద్ధిని' అతిక్రమించుట ద్వారా స్వరూప పూర్ణస్థితిలోకి మేల్కొనుట తప్పించి ఇక కోరుకోవలసింది ఏముంది ఈ మానవజన్మలో! నన్ను నేను పవిత్రుడను చేసుకోవడంకన్నా మహత్కార్యం ఈ సృష్టిలో లేనేలేదు. అట్టి స్వరూప ఎరుకలోనికి మేల్కొనుటకు గురువు అనుగ్రహమే అత్యంత కీలకం.

**చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం**

# ద్రవించి చేసే పనే - దయ

ప్రపంచంతో సమత భగవంతునితో మమత చేకూర్చుకోవాలి. లోకంలో ఎప్పుడూ ద్వేషంతో ద్వేషాన్ని ఎదుర్కొనలేము. ప్రేమతో మాత్రమే ఎదుర్కొనగలము. ప్రేమ అన్నా దయ అన్నా ఒక్కటే రోజూ గంటల తరబడి ధ్యానం చేసి నామజపంచేసి గుడికి వెళ్ళి వస్తూ ఉంటే దారిలో దరిద్రనారాయణుడు ఆకలితో తాళలేక కొంచెము ప్రసాదం ఇయ్యమని ప్రాదేయపడి చేయిచాస్తే చీదరించుకొని దూషిస్తూ వెళ్ళిపోతే అది ఆధ్యాత్మిక జీవితం అనిపించుకోదు. కనిపించిన మనిషిలో దైవాన్ని చూడలేనివాడు. కంటికి కనబడని దేవుణ్ణి ప్రేమిస్తున్నాను అంటే అది భూటకం భగవాన్" ఇది అంతా పరమాత్మ స్వరూపమే అనే బుద్ధితో చేసిన జగత్తు యొక్క సేవే పరమశివుని పూజ అవుతుంది" అన్నారు. మన హృదయంలో ప్రేమ భావన ఉంటే ఏమీలేని వానికి భాగ్యవంతునికే ఒకే రకమైన మర్యాద ప్రేమ చూపగలము. అరుణగిరి ప్రదక్షిణలో భగవాన్‌తో ఒక వృద్ధుడు ఆకలితో అలసి నడుస్తూ ఉంటే ఆతనితో భగవాన్ "నీతో భోజనం చెయ్యాలి అని ఉంది అని ఆశ్రమానికి తీసుకొని వెళ్ళి ఇది బాగుంది అని కడుపారా భోజనం పెట్టారు. ఆతని దరిద్రాన్ని గుర్తుచేస్తూ ఒక్కమాట అనకుండా సమాదరణతో ప్రేమను చూపించారు. దానినే దయ అంటారు. ఇతరులనుంచి ప్రతిఫలం పొందుతాము అనే ఆశతో మర్యాద చేయటం భయం వల్ల కలిగిన ఫలితములు. అది ప్రేమ కాదు. ప్రేమ కోరదు ఇస్తుంది. ప్రేమ భావనలో భయభీతులు ఉండవు. ఎవరికైన ఏదైనా సహాయం చేస్తే అది తిరిగి మనకే వచ్చేస్తుంది అంటే ఆ వ్యక్తే తిరిగి ఇస్తాడు అని కాదు మరో జన్మలోనైనా మరియొకరితోనైనా ఆ దాతకు ఈశ్వరుడు ఆ సహాయాన్ని సమకూరుస్తాడు. అందుకనే దయగల హృదయం భగవంతుని నిలయం" అన్నారు. మనకు దయ ఉంటే దేవతలు కూడా దణ్ణం పెడతారు. దయను జయించగలిగినది ఈ ప్రపంచంలో లేనేలేదు". "దిక్కు లేనివాని దీనతను బాపిన; పురుషుడు ఇహమునందే పూజ్యుడగును; పరమునందు దాని భాగ్యమేమనవచ్చును; అనారు వేమన. శ్రీనాన్నగారు "ఒక కంటిలో ప్రేమ మరోకంటిలో కరుణ ఉంచుకోండి జ్ఞానం రాకేంజేస్తుంది" అన్నారు. సానుభూతి లేకుండా ఎవడు ఒక ఫర్లాంగు నడిస్తే వాడు వాని ప్రేతవస్త్రాన్ని కట్టుకొని తన శ్మసాన స్థలానికి తానే నడుస్తున్నట్లు లెక్క. మన కర్మల మీద ప్రేమ తత్వకాంతి ప్రసరించినప్పుడు పరిశ్రమ కళగా మారుతుంది. ఎక్కడ కాయకష్టం హేయంగా చూడబడుతుందో అక్కడ ఫలితం స్తబ్ధత, నశింపు జరుగుతుంది. ప్రేమ శాశ్వతం, ఆనంద ప్రదము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం